RNI NO.TELTEL/2023/12249

# హైదరాబాద్ పల్స్

జాతీయ తెలుగు దినపత్రిక


దేశం ముఖ్యం.... దేశ ప్రజల భద్రత ముఖ్యం.... మతం కాదు...

epaper.hyderabadpulsenews.in




సీఈఓ : కె నవీన్ కుమార్ | ఎడిటర్: డా. రాహుల్ కుమార్ | సంపుటి: 03 | సంచిక : 223 | పేజీలు : 08 | ఆదివారం | 23-08-2026 | వెల :4/-

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD, SANGAREDDY, WARANGAL, MANCHIRYAL, VIJAYWADA, GUNTUR, KURNOOL, TIRUPATI, KADAPA, BENGALURU, MUMBAI, CHENNAI, DELHI.



## ఆ భవనాలన్నీ కూల్చేస్తాం

గచ్చిబౌలి ప్రమాద స్థలాన్ని పరిశీలించిన అనంతరం రంగనాథ్

- గచ్చిబౌలి అంజయ్యనగర్‌లో కూలిన భవనం
- ఏడంతస్తుల భవనం కూలి పక్కనున్న అపార్ట్‌మెంట్‌పై పడిన శిథిలాలు
- శిథిలాల కింద నుంచి రెండు మృతదేహాలను వెలికితీసిన రెస్క్యూ సిబ్బంది

2

హైదరాబాద్ పల్స్,డెస్క్

హైదరాబాద్ నగరంలోని గచ్చిబౌలి అంజయ్యనగర్ లో నిర్మాణంలో ఉన్న ఏడంతస్తుల భవనం ఒక్కసారిగా కుప్పకూలింది. ఈ ఘటనలో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. ప్రమాద సమాచారం అందుకున్న ఫైర్, డీఆర్ఎఫ్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. శిథిలాల కింద నుంచి రెండు మృతదేహాలను వెలికి తీశారు. నాలా పక్కనే 50 గజాల స్థలంలో నిర్మాణం చేపట్టిన ఈ బిల్డింగ్ ఒక్కసారిగా కుప్పకూలడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. ఈ



కేంబ్రిడ్జ్ వర్సిటీని సందర్శించిన సీఎం రేవంత్‌రెడ్డి

- విద్య, పరిశోధనల్లో భాగస్వామ్యంపై చర్చ
- లండన్ కేంబ్రిడ్జ్ వర్సిటీని సందర్శించిన సీఎం రేవంత్‌రెడ్డి బృందం
- విద్య, పరిశోధన రంగాల్లో భాగస్వామ్యంపై కేంబ్రిడ్జ్ ప్రతినిధులతో చర్చ
- హైదరాబాద్‌లో ఎడ్యుకేషన్, రీసెర్చ్ ప్రోగ్రామ్‌లు పెట్టాలని కోరిన సీఎం బృందం

# విద్య,పరిశోధనల్లో భాగస్వామ్యం

2

హైదరాబాద్ పల్స్,డెస్క్

లండన్ లోని ప్రఖ్యాత కేంబ్రిడ్జ్ వర్సిటీని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బృందం సందర్శించింది. విద్య,పరిశోధన రంగాల్లో భాగస్వామ్యంపై కేంబ్రిడ్జ్ ప్రతినిధులతో సీఎం చర్చించారు. హైదరాబాద్‌లో ఎడ్యుకేషన్, రీసెర్చ్ ప్రొగ్రామ్‌లు పెట్టాలని కోరారు. యువపారిశ్రామికవేత్తలకు ఇంక్యుబేషన్, స్టార్టప్‌ల అభివృద్ధిలో భాగస్వామ్యం చేయాలని విజ్ఞప్తి చేశారు. స్పష్టమైన కార్యచరణ ప్రణాళికను రూపొందించుకోవాలని ఇరువర్గాలు నిర్ణయం తీసుకున్నారు. ఈ కార్యక్రమానికి మంత్రి శ్రీధర్‌బాబు, సీఎం సలహాదారు రామకృష్ణారావు, ప్రత్యేక సీఎస్ జయేశ్ రంజన్‌లు హాజరయ్యారు.

ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు లివర్ పుల్ ఆసక్తి లైఫ్ సైన్సెస్, టెక్నాలజీ, క్రీడలు, సృజనాత్మక ఆర్థిక వ్యవస్థకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు లండన్‌లోని లివర్‌పూల్ సిటీ డెవలప్‌మెంట్ విభాగం ఆసక్తి చూపింది. భాగస్వామ్య ఒప్పందం చేసుకునేందుకు లివర్‌పూల్ ప్రతినిధి బృందం అక్టోబర్‌లో హైదరాబాద్ రానుంది. లండన్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఇవాళ లివర్‌పూల్ సిటీ డెవలప్‌మెంట్ విభాగానికి చెందిన సుసాన్ ఫిన్నెగాన్, నూలా గల్లాఘర్, లివర్‌పూల్ ఫుట్‌బాల్ క్లబ్‌కు చెందిన పలువురు మర్యాదపూర్వకంగా కలిశారు.



## యుద్ధానికి ముగింపు పలుకుదాం..

ట్రంప్‌కు ఇరాన్ అధ్యక్షుడి సందేశం

- శక్తిమంతంగా, గౌరవంగా ఉన్నప్పుడే ం ముగించడం మేలని వ్యాఖ్య
- అమెరికాను ప్రపంచమంతా ద్వేషిస్తోందన్న పెజెష్కియాన్
- కొనసాగుతున్న ప్రతిష్ఠంభన.. మధ్యవర్తిత్వం చేస్తున్న ఒమన్

2

హైదరాబాద్ పల్స్,డెస్క్

అమెరికాతో నెలల తరబడి కొనసాగుతున్న యుద్ధానికి ముగింపు పలకాలని ఇరాన్ పిలుపునిచ్చింది. తాము శక్తిమంతమైన, గౌరవప్రదమైన స్థితిలో ఉన్నప్పుడే యుద్ధాన్ని ముగించడం మేలని ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ కీలక వ్యాఖ్యలు చేశారు.శుక్రవారం వైద్యులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

## న్యాయమూర్తులు దేవుళ్లు కాదు

ప్రతి తీర్పు సరైనదిగా ఉండకపోవచ్చు : జస్టిస్ సంజయ్ కరోల్

- వీడ్కోలు ప్రసంగంలో జస్టిస్ సంజయ్ కరోల్ కీలక వ్యాఖ్యలు
- న్యాయమూర్తులు దేవుళ్లు కాదన్న జస్టిస్ సంజయ్
- చట్టాన్ని మాత్రమే కాదని, న్యాయాన్ని కూడా దృష్టిలో పెట్టుకోవాలన్న జస్టిస్ కరోల్

2



హైదరాబాద్ పల్స్,డెస్క్

'న్యాయమూర్తులు దేవుళ్లు కాదు. ప్రతి తీర్పునూ కచ్చితంగా సరైనదిగా ఇవ్వలేం' అని సుప్రీంకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ సంజయ్ కరోల్ అన్నారు. న్యాయవ్యవస్థలో వినయం, బాధ్యత, మానవీయ కోణం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. శనివారం సుప్రీంకోర్టులో తన చివరి పని రోజున ఆయనకు ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా భావోద్వేగంతో కీలక వ్యాఖ్యలు చేశారు.'రాజ్యాంగం, న్యాయమూర్తులు కేవలం




## క్షమాపణ చెప్పాలి

- సీఎం రేవంత్ రెడ్డికి కొండా సురేఖ క్షమాపణ చెప్పాలి
- కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు డిమాండ్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కొండ సుష్మిత విమర్శలు
- ఆ వ్యాఖ్యలను ఖండిస్తున్న ని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు
- క్రమశిక్షణా కమిటీ వారిపై సరైన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ సభ్యుల విజ్ఞప్తి

2

## నేను శంకుస్థాపన చేశా.. నేనే ప్రారంభిస్తున్నా

వెలిగొండపై సీఎం చంద్రబాబు

- మూడు దశాబ్దాల కల వెలిగొండ ప్రాజెక్టు మొదటి దశ ప్రారంభానికి సిద్ధం
- ఆగస్టు 31న ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేయనున్నట్లు సీఎం వెల్లడి
- కూటమి ప్రభుత్వం 48 రోజుల్లో నిర్వాసితులకు రూ.768 కోట్ల పరిహారం చెల్లింపు
- గత ప్రభుత్వ నిర్వాకం వల్లే ప్రాజెక్టు ఆలస్యమైందని సీఎం చంద్రబాబు విమర్శ
- ప్రభుత్వం అందించిన పరిహారంపై నిర్వాసితుల హర్షం

హైదరాబాద్ పల్స్,డెస్క్

మార్కాపురం, ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల ప్రజల మూడు దశాబ్దాల చిరకాల స్వప్నం నెరవేరబోతోంది. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న వెలిగొండ ప్రాజెక్టు మొదటి దశను ఆగస్టు 31వ తేదీన ప్రారంభించి నీటిని విడుదల చేయనున్నట్లు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు. శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో జరిగిన ఒక కార్యక్రమంలో, వెలిగొండ ప్రాజెక్టు నిర్వాసితులకు మూడో విడత

2





2

## అసలు వ్యక్తులను గుర్తించాలి

ఆ అవమానకర వ్యాఖ్యల వెనుక ఉన్న అసలు వ్యక్తులను గుర్తించాలి: కొండా సురేఖ

## 48 మందికి జాతీయ ఉపాధ్యాయ పురస్కారాలు

- సెప్టెంబర్ 5న ప్రదానం చేయనున్న రాష్ట్రపతి
- అవార్డు గ్రహీతల జాబితాలో రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ఉపాధ్యాయులు
- సెప్టెంబర్ 5న ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో పురస్కారాలను ప్రదానం చేయనున్న రాష్ట్రపతి



2

హైదరాబాద్ పల్స్,డెస్క్

పాఠశాల విద్య, అక్షరాస్యతకు చేసిన సేవలకు గుర్తింపుగా 48 మంది ఉపాధ్యాయులకు ప్రభుత్వం శుక్రవారం జాతీయ ఉపాధ్యాయ అవార్డులు 2026ను ప్రకటించింది. అవార్డు గ్రహీతల జాబితాలో రాష్ట్రాలు, కేంద్రపాలిత

## న్యాయ వ్యవస్థలే వెన్నెముక

- వేగవంతమైన ఆర్థిక పురోగతికి పటిష్ఠమైన న్యాయ వ్యవస్థలే వెన్నెముక: సీజేఐ సూర్యకాంత్
- ఢిల్లీలో జరిగిన 11వ బ్రిక్స్ ప్లస్ లీగల్ ఫోరంలో పాల్గొన్న సీజేఐ జస్టిస్ సూర్యకాంత్
- అక్కడ న్యాయనామిక్స్, న్యాయ సేతు అనే పదాలను పరిచయం చేసిన ప్రధాన న్యాయమూర్తి

హైదరాబాద్ పల్స్,డెస్క్

స్థిరమైన ఆర్థిక వృద్ధి కేవలం భౌగోళిక లేదా ముడి సహజ వనరులపై మాత్రమే కాకుండా సంస్థాగత స్థిరత్వం, విశ్వాసం, సామర్థ్యంపై ఎక్కువగా ఆధారపడి ఉంటుందని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ తెలిపారు. బ్రిక్స్ ప్లస్ దేశాలు

2



# నేను శంకుస్థాపన చేశా.. నేనే ప్రారంభిస్తున్నా

మొదటి పేజీ తరువాయి

పరిహారంగా రూ.250 కోట్ల చెక్కును ఆయన అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకుంటున్నామని స్పష్టం చేశారు.

**48 రోజుల్లోనే రూ.768 కోట్ల పరిహారం**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కేవలం 48 రోజుల్లోనే వెలిగొండ ప్రాజెక్టు నిర్వాసితులకు రికార్డు స్థాయిలో పరిహారం అందించింది. మూడు విడతల్లో మొత్తం 6,206 నిర్వాసిత కుటుంబాలకు రూ.768 కోట్లను ప్రభుత్వం చెల్లించింది. తొలి విడతలో 2,557 కుటుంబాలకు రూ.318 కోట్లు, రెండో విడతలో 1,622 కుటుంబాలకు రూ.200 కోట్లు అందించగా, శుక్రవారం మూడో విడతగా 2,027 కుటుంబాలకు రూ.250 కోట్లు సీఎం చేతుల మీదుగా అందజేశారు. నిర్వాసితులకు ఇంకా రూ.132 కోట్లు మాత్రమే చెల్లించాల్సి ఉందని అధికారులు తెలిపారు. ఈ ప్రాజెక్టు తొలిదశ పూర్తయితే 1.19 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు, సుమారు 4 లక్షల మందికి తాగునీరు అందుబాటులోకి వస్తుంది.

**గత ప్రభుత్వ డ్రామాలతోనే ఆలస్యం: సీఎం**

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ.. “1996లో నేనే ఈ ప్రాజెక్టుకు రూపకల్పన చేసి శంకుస్థాపన చేశాను. ఇప్పుడు 2026లో నా చేతుల మీదుగానే ప్రారంభించడం నా అదృష్టం. గత రెండేళ్లలో రూ.2,250 కోట్లు ఖర్చు చేసి మొదటి దశ పనులు పూర్తి చేశాం” అని తెలిపారు. ఈ ఏడాది ఎల్ నినో ప్రభావంతో వర్షపాతం తక్కువగా ఉన్నా, శ్రీశైలం, నాగార్జున సాగర్‌లకు నీరు రాకపోయినా, ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం ప్రాజెక్టును ప్రారంభిస్తున్నామని స్పష్టం చేశారు.“వాస్తవానికి ఈ ప్రాజెక్టు 2021లోనే పూర్తి కావాల్సింది. కానీ గత పాలకుల డ్రామాల వల్ల ఆలస్యమైంది. వారు రాష్ట్రాన్ని ఆర్థికంగా చిదిమేశారు. అయినా ‘సూపర్ సిక్స్’ వంటి పథకాలను అమలు చేస్తూనే, ప్రాజెక్టులను పూర్తి చేస్తున్నాం” అని విమర్శించారు.గంగా-గోదావరి-కావేరి నదుల అనుసంధానం ద్వారా దేశంలో నీటి భద్రత సాధించవచ్చని సదరన్ జోనల్ కౌన్సిల్ సమావేశంలో ప్రతిపాదించినట్లు గుర్తుచేశారు. మార్కాపురం జిల్లాలో జల్ జీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికి కుళాయి నీరు అందిస్తామని, సెప్టెంబరులో హార్టికల్చర్ హబ్‌కు శంకుస్థాపన చేస్తామని హామీ ఇచ్చారు. రామాయపట్నం పోర్టు ద్వారా రైతులు తమ ఉద్యాన ఉత్పత్తులను ఎగుమతి చేసుకునే అవకాశం కలుగుతుందన్నారు.

**పరిహారంపై నిర్వాసితుల హర్షం**

ప్రభుత్వం అందించిన పరిహారంపై నిర్వాసితులు హర్షం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం తమను ఇబ్బందులు పెట్టిందని, కూటమి ప్రభుత్వం ఆదుకుందని రైతు కాశిరెడ్డి ఆనందం వ్యక్తం చేశారు. చంద్రబాబు శంకుస్థాపన చేసిన ప్రాజెక్టును ఆయనే ప్రారంభించడం సంతోషంగా ఉందని మరో నిర్వాసితుడు బోగెం శ్రీనివాసులు అన్నారు. ప్రభుత్వం తమకు పూర్తి పరిహారం అందించి, కాలనీల్లో మంచి వసతులు కల్పించిందని మహిళా నిర్వాసితురాలు ఉషమ్మ తెలిపారు. ఈ కార్యక్రమంలో జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి, పలువురు ఎమ్మెల్యేలు, అధికారులు పాల్గొన్నారు

# యుద్ధానికి ముగింపు పలుకుదాం..

మొదటి పేజీ తరువాయి

“మనం శక్తిమంతంగా, గౌరవంగా ఉన్న ఈ సమయంలోనే యుద్ధానికి ముగింపు పలకడం ఉత్తమం” అని పెజెష్కియాన్ అన్నారు. ఈ పోరాటంలో ఇరాన్ విజయం సాధించిందని ప్రపంచం గుర్తించిందని ఆయన పేర్కొన్నారు. అంతర్జాతీయ నిబంధనలను ఉల్లంఘించి అమెరికా పాఠశాలలు, ఆసుపత్రులపై దాడులు చేస్తోందని, అందుకే ప్రపంచవ్యాప్తంగా అమెరికా పట్ల ద్వేషం పెరిగిపోయిందని ఆరోపించారు.ఈ ఏడాది ఆరంభంలో అమెరికా, ఇజ్రాయెల్ వైమానిక దాడులతో ప్రారంభమైన ఈ సంఘర్షణ, ప్రస్తుతం ప్రతిష్ఠంభనలో కొనసాగుతోంది. హర్మూజ్ జలసంధిలో ఇబ్బందులు, అమెరికా నౌకాదళ దిగ్బంధనం వంటి పరిణామాలు చోటుచేసుకున్నాయి. మరోవైపు, వాషింగ్టన్ ఆర్థిక ఒత్తిడిని తీవ్రతరం చేస్తూ కొత్త ఆంక్షలు విధించేందుకు సిద్ధమవుతోంది. చర్చలకు మార్గం సుగమం చేసేందుకు ఒమన్ మధ్యవర్తిత్వ ప్రయత్నాలు కొనసాగిస్తోంది.జూన్‌లో అమెరికాతో కుదిరిన అవగాహన ఒప్పందంలో ఇరాన్ లొంగిపోయినట్లు ఎలాంటి నిబంధనలు లేవని ఆయన స్పష్టం చేశారు. బెదిరింపులకు తలొగ్గేది లేదని, అవసరమైతే గట్టిగా బదులిచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు. దేశంలో ఆర్థిక ఒత్తిళ్లు, అంతర్జాతీయంగా ఒంటరితనం పెరుగుతున్న నేపథ్యంలో, శక్తిమంతమైన స్థితి నుంచే తాము శాంతి చర్చలకు సిద్ధమనే సంకేతాలు పంపేందుకే టెహ్రాన్ ఈ వ్యాఖ్యలు చేసినట్లు విశ్లేషకులు భావిస్తున్నారు.

# విద్య, పరిశోధనల్లో భాగస్వామ్యం

మొదటి పేజీ తరువాయి

**తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు రండి**

లండన్‌లోని ప్రఖ్యాత ఇంపీరియల్ కాలేజీని సీఎం సలహాదారు రామకృష్ణారావు సందర్శించారు. ఇంపీరియల్ కాలేజీ చీఫ్ ఆఫ్ స్టాఫ్, అమాండా వోల్తుయిజెన్, దక్షిణాసియా సీనియర్ ఇంటర్నేషనల్ రిలేషన్స్ మేనేజర్ రొసాన్నా గిల్లెస్పీతో రామకృష్ణారావు సమావేశమయ్యారు. హైదరాబాద్‌లో షార్ట్ టర్మ్ కోర్సులు, ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ కార్యక్రమాలు నిర్వహించే అవకాశాలను పరిశీలిస్తామని అమాండా తెలిపారు. పరిశోధన రంగంలో భాగస్వామ్యం విద్యార్థులు, అధ్యాపకుల మార్పిడి కార్యక్రమాలపై కూడా తెలంగాణతో కలిసి పనిచేసేందుకు ఆసక్తి చూపారు. డిసెంబరులో జరగనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్?కు రావాలని ఇంపీరియల్ కాలేజీ ప్రతినిధులను రామకృష్ణారావు ఆహ్వానించారు.

# క్షమాపణ చెప్పాలి

మొదటి పేజీ తరువాయి

సీఎం రేవంత్?రెడ్డిపై కొండా సురేఖ కుమార్తె సుష్మిత ఇటీవల చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్‌లో తీవ్ర స్థాయిలో చర్చకు దారి తీశాయి. ఈ విషయంలో కాంగ్రెస్ పార్టీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆ వ్యాఖ్యలను ఖండిస్తున్నట్లు తెలిపారు. రేవంత్ రెడ్డికి కొండా సురేఖ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ వ్యాఖ్యలపై శుక్రవారం కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇవాళ కూడా కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు మీడియా సమావేశం నిర్వహించి, కొండా సురేఖ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

**ఎలాంటి చర్యలకైనా పార్టీ సిద్ధం**

సీఎం రేవంత్ రెడ్డికి మంత్రి కొండా సురేఖ, ఆమె కుమార్తె క్షమాపణ చెప్పాలని విప్ విజయరమణారావు డిమాండ్ చేశారు. గౌరవనీయమైన పదవిలో ఉన్న వ్యక్తి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, కుమార్తె మాట్లాడితే బాధ్యత ఉండదా అని ప్రశ్నించారు. కొండా సురేఖ వివరణతో పార్టీ సంతృప్తి చెందకపోతే ఎలాంటి చర్య తీసుకోవడానికైనా పార్టీ వెనుకాడదని హెచ్చరించారు.

**మా టీమ్ పై కుట్ర జరుగుతోంది**

కొండా సురేఖ ఇప్పటికైనా ఆత్మవిమర్శ చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ విప్ ఆది శ్రీనివాస్ సూచించారు. కొండా సురేఖ, రాజగోపాల్‌రెడ్డి, చిన్నారెడ్డి ఎవరైనా పార్టీకి వ్యతిరేకంగా మాట్లాడటం సరికాదన్నారు. ‘కాంగ్రెస్ టీమ్ 66 మంది. మా టీమ్‌పై కుట్ర జరుగుతోంది, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మేము అండగా ఉన్నాం’ అని ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు.కేసీఆర్‌ను రేవంత్‌రెడ్డి గద్దె దింపారని, సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారని ప్రభుత్వ విప్ లు పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధిని ఆపేందుకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని విమర్శిస్తున్నారన్నారు. కొండా సురేఖకు సొంత జిల్లా నాయకులతో కూడా సఖ్యత లేదని తెలిపారు.

# న్యాయ వ్యవస్థలే వెన్నెముక

మొదటి పేజీ తరువాయి

మానవాళిలో

40శాతానికి పైగా, ప్రపంచ పీపీపీ ఉత్పత్తిలో దాదాపు 40శాతం వాటాను కలిగి ఉన్నాయని చెప్పారు. వేగవంతమైన ఆర్థిక పురోగతికి పటిష్ఠమైన న్యాయ వ్యవస్థలే వెన్నెముక అని పేర్కొన్నారు. ఈ క్రమంలో చట్టబద్ధమైన పాలనకు సంబంధించిన ‘న్యాయనామిక్స్’, ‘న్యాయసేతు’ అనే పదాలను పరిచయం చేశారు.సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ శనివారం దిల్లీలో జరిగిన 11వ బ్రిక్స్ ప్లస్ లీగల్ ఫోరంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ‘న్యాయ సేతు’ (న్యాయ వారధి), ‘న్యాయఆర్థిక శాస్త్రం’ (న్యాయనామిక్స్) అనే కాన్సెప్ట్‌లను పరిచయం చేశారు. బ్రిక్స్ ప్లస్ దేశాలలో చట్టపరమైన, ఆర్థిక శక్తిని ఏకీకృతం చేసేందుకు ‘న్యాయనామిక్స్’, ‘న్యాయ సేతు’ దార్శనికత గురించి వివరించారు. ‘బహుధ్రువ ప్రపంచంలో చట్టబద్ధ పాలన’ అనే అంశంపై జరిగిన ప్రారంభ ప్లీనరీలో సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ ఈ మేరకు వ్యాఖ్యానించారు.‘బ్రిక్స్ పరస్పర సహకారం కోసం మరింత విస్తృతమైన వేదికగా ఎదిగింది’ బ్రిక్స్ దేశాల మధ్య బలమైన న్యాయ సహకారం అవసరాన్ని బార్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఉపాధ్యక్షుడు ఎస్.ఎస్. నాగానంద్ కూడా నొక్కి చెప్పారు. బ్రిక్స్ ఏర్పడినప్పుడు దాని ప్రధాన దృష్టి సభ్య దేశాల మధ్య ఆర్థిక, ద్రవ్య సహకారాన్ని బలోపేతం చేయడంపైనే ఉందని పేర్కొన్నారు. సంవత్సరాలుగా బ్రిక్స్ పరస్పర సహకారం, భాగస్వామ్యం కోసం మరింత విస్తృతమైన వేదికగా ఎదిగిందని గుర్తు చేసుకున్నారు. దీంతో ఆర్థిక సంబంధాలతో పాటు చట్టపరమైన సంబంధాలు కూడా అనివార్యంగా బలపడతాయని తెలిపారు.

# న్యాయమూర్తులు దేవుళ్లు కాదు

మొదటి పేజీ తరువాయి

చట్టాన్ని సరిగ్గా వర్తింపజేయాలని మాత్రమే కోరడం లేదు. చట్టాన్ని న్యాయబద్ధంగా అమలు చేయడం కూడా అంతే ముఖ్యం. కోర్టుకు వచ్చే ప్రతి వ్యక్తిని కేవలం పిటిషనర్‌గా కాకుండా ఒక మనిషిగా చూడాల్సిన అవసరం ఉంది. ఒక పిటిషన్ కేసుకు సంబంధించిన వాస్తవాలను మాత్రమే చెబుతుంది. కానీ కోర్టును ఆశ్రయించిన వ్యక్తి ఇప్పటికే ఏం కోల్పోయాడు? తనకు కోర్టు నుంచి ఏం ఆశిస్తున్నాడు? వంటి విషయాలను అది చెప్పదు. అందుకే న్యాయమూర్తికి వినయం అవసరం’ అని జస్టిస్ కరోల్ తెలిపారు.

‘కోర్టులో మాటలే కాదు, మౌనం కూడా ముఖ్యం’ దాదాపు నాలుగు దశాబ్దాల తన న్యాయ ప్రస్థానాన్ని గుర్తుచేసుకున్నారు జస్టిస్ కరోల్. సుమారు 40 ఏళ్లపాటు కోర్టు గదుల్లో గడిపినట్లు తెలిపారు. తొలుత న్యాయవాదిగా, ఆ తర్వాత 19 ఏళ్లపాటు న్యాయమూర్తిగా సేవలందించానని చెప్పారు. కోర్టులో వినిపించే వాదనలతో పాటు మౌనంలో దాగి ఉన్న మాటలను కూడా న్యాయమూర్తులు అర్థం చేసుకోవాలని అన్నారు. న్యాయ ప్రక్రియలో న్యాయవాదులు చేసే వాదనలే కాకుండా, మాటల మధ్యలో బాధితులు కోరుకునేది ఏమిటో గుర్తించడం కూడా ముఖ్యమని పేర్కొన్నారు. 1996లో తొలిసారి సుప్రీంకోర్టు మొదటి నంబర్ కోర్టులోకి వెళ్లిన గుర్తు చేస్తూ, అప్పట్లో న్యాయమూర్తుల బెంచ్ దాదాపు ఆరు అడుగుల ఎత్తులో ఉన్నట్లు తనకు అనిపించిందన్నారు. కింద నుంచి చూస్తే ఆ ఎత్తు అధికారానికి ప్రతీకగా కనిపించవచ్చని, కానీ న్యాయమూర్తిగా ఆ స్థానంలో కూర్చున్నప్పుడు అది గౌరవం, నిజాయితీతో కూడిన బాధ్యతకు ప్రతీక అని అర్థమైందన్నారు.

సాధారణ పౌరుడి విశ్వాసమే సుప్రీంకోర్టు బలం సుప్రీంకోర్టు గొప్పతనం కేవలం కీలకమైన కేసుల్లో వెలువడే తీర్పుల్లో లేదని జస్టిస్ కరోల్ అన్నారు. న్యాయం జరుగుతుందనే నమ్మకంతో కోర్టు గడప తొక్కే సాధారణ పౌరుడి విశ్వాసమే దాని అసలైన బలమని పేర్కొన్నారు. అయితే న్యాయం చాలా దూరంగా ఉందని, ఖరీదైనదని లేదా భయపెట్టేదిగా భావించి కోర్టుల గడప తొక్కలేని వారిని కూడా గుర్తుంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. చట్టం, న్యాయ ప్రక్రియ, రాజ్యాంగబద్ధత వంటి భావనలను అర్థం చేసుకోవడానికి ధర్మం అనే భావనను ఉదాహరణగా తీసుకోవచ్చని జస్టిస్ కరోల్ అన్నారు. ఇక్కడ ధర్మం అంటే ఆచారం కాదని, విధి, బాధ్యత అని వివరించారు. కోర్టు ముందు నిలబడే వ్యక్తి ఎంత చిన్నవాడైనా, ఎంత దుర్భర పరిస్థితుల్లో ఉన్నా అతడి మాటను న్యాయమూర్తి వినాలని చెప్పారు. న్యాయం పట్ల నిబద్ధతతో వ్యవహరించడమే న్యాయమూర్తి ప్రధాన కర్తవ్యమని పేర్కొన్నారు.

**‘ప్రతి ఒక్కరూ తమ నిర్ణయాలకు న్యాయమూర్తులే’**

న్యాయవ్యవస్థలోని బాధ్యతలు కేవలం కోర్టు గదులకే పరిమితం కావని జస్టిస్ కరోల్ అన్నారు. ప్రతి వ్యక్తి తన నిర్ణయాలు, ప్రవర్తన, అధికార వినియోగంపై తానే న్యాయమూర్తిగా వ్యవహరించాల్సి ఉంటుందని సూచించారు. ‘న్యాయమూర్తి వస్త్రాలు ధరించే ముందు కూడా న్యాయమూర్తే. వాటిని తొలగించిన తర్వాత కూడా న్యాయమూర్తే’ అని ఆయన వ్యాఖ్యానించారు. భారత్?కు కేవలం ఒక రాజ్యాంగం ఉండటమే కాదు, దానిని మన జీవితాల్లో ఆచరించాల్సిన అవసరం ఉందని జస్టిస్ కరోల్ అన్నారు. రాజ్యాంగం గొప్పతనం పెద్ద పెద్ద కేసుల్లోనే పరీక్షకు గురికాదని, సాధారణ పౌర జీవితంలోని ప్రతి చర్యలోనూ అది ప్రతిబింబించాలని పేర్కొన్నారు.

# 48 మందికి జాతీయ ఉపాధ్యాయ పురస్కారాలు

మొదటి పేజీ తరువాయి

ప్రాంతాల ఉపాధ్యాయులతో పాటు కేంద్రీయ విద్యాలయ సంఘటన్, నవోదయ విద్యాలయ సమితి, సైనిక్ పాఠశాలలు, ఆదర్శ గిరిజన పాఠశాలలు, పి.ఎం. శ్రీ పాఠశాలలు వంటి సంస్థలకు చెందిన వారు కూడా ఉన్నారు. 2026 ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సెప్టెంబర్ 5న దిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో 48 మంది పాఠశాల ఉపాధ్యాయులకు జాతీయ ఉపాధ్యాయ పురస్కారాలను ప్రదానం చేయనున్నారు. అలాగే, పురస్కారం అందుకున్న ప్రతి ఒక్కరి అద్భుతమైన కృషి, సేవలను తెలియజేసే లఘు డాక్యుమెంటరీలను కూడా ప్రదర్శిస్తారు. కాగా, ఎంపికైన వారిలో 26 మంది పురుషులు కాగా, 22 మంది మహిళలు ఉన్నారు. దేశవ్యాప్తంగా ఉపాధ్యాయుల కృషిని గుర్తించి, వారి సేవలను గౌరవించేందుకు ఏటా ఈ పురస్కారాలను అందిస్తున్నారు.

**ఎవరెవరికి అవార్డులు వరించాయంటే!**

అవార్డు గ్రహీతల జాబితాలో గోవా నుంచి మహాదేవ్ హనమంత్ షిండే, గుజరాత్ నుంచి నితిన్ కుమార్ మహేంద్రకుమార్ పాఠక్, హరియాణా నుంచి అనిల్ కౌశిక్, హిమాచల్ ప్రదేశ్ నుంచి మంజరి వి. మహాజన్ ఎంపికయ్యారు. గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్‌కు చెందిన జాఫర్ ఆలమ్ ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారానికి ఎంపికయ్యారు. అలాగే, జమ్మూకశ్మీర్ నుంచి మహమ్మద్ అయాజ్ రైనా, మధ్యప్రదేశ్ నుంచి అర్చనా శు క్లా కూడా ఈ ఏడాది జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపికయ్యారు. వీరితో పాటు మహారాష్ట్ర, మణిపూర్, మిజోరం, నాగాలాండ్, ఒడిశా, పంజాబ్, రాజస్థాన్, సిక్కిం, లద్దాఖ్ తదితర ప్రాంతాల నుంచి కూడా ఉపాధ్యాయులు ఎంపికయ్యారు.

**ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ**

జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల కోసం ఈ ఏడాది అర్హులైన ఉపాధ్యాయుల నుంచి ఆన్‌లైన్‌లో స్వీయ దరఖాస్తులను స్వీకరించారు. కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ పోర్టల్ ద్వారా జూన్ 15 నుంచి జులై 20 వరకు దరఖాస్తు ప్రక్రియ జరిగింది. వీటిని పాఠశాల విద్య, అక్షరాస్యత శాఖ మూడు దశల్లో పరిశీలించింది. ముందుగా జిల్లా స్థాయిలో, ఆ తర్వాత రాష్ట్ర స్థాయిలో, చివరగా జాతీయ స్థాయిలో ఎంపిక ప్రక్రియ చేపట్టారు. ఈ విధానం ద్వారా విద్యార్థుల అభ్యున్నతి, పాఠశాల విద్య నాణ్యత మెరుగుదల, వినూత్న బోధనా పద్ధతులు, సమాజంపై ప్రభావం వంటి అంశాల్లో విశేష కృషి చేసిన ఉపాధ్యాయులను గుర్తించి పురస్కారాలను బహూకరించనున్నారు.

**సేవలను జాతీయ స్థాయిలో గుర్తించి**

అయితే, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల ప్రధాన ఉద్దేశం, దేశంలోని అత్యుత్తమ ఉపాధ్యాయుల ప్రత్యేక సేవలను గుర్తించి గౌరవించడం. అంతేకాదు, తమ నిబద్ధత, కృషి, అంకితభావంతో పాఠశాల విద్య నాణ్యతను మెరుగుపరచడంతో పాటు, విద్యార్థుల జీవితాల్లో సానుకూల మార్పు తీసుకొచ్చిన ఉపాధ్యాయులను ఈ అవార్డులతో సత్కరిస్తారు. కాగా, ఉపాధ్యాయులు కేవలం పిల్లలకు పాఠ్యాంశాలను బోధించడమే కాకుండా, వారిలో ఆత్మవిశ్వాసం, సృజనాత్మకత, సామాజిక బాధ్యత వంటి విలువలను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. అయితే, అలాంటి సేవలను జాతీయ స్థాయిలో గుర్తించడం ఈ అవార్డుల ప్రధాన ఉద్దేశం. కాగా, ఈ కార్యక్రమాన్ని కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ అధికారిక వెబ్‌కాస్ట్ ప్లాట్‌ఫామ్‌తో పాటు, మంత్రిత్వ శాఖకు చెందిన సోషల్ మీడియా వేదికల్లోనూ ఇతర ప్రసార కార్యక్రమాల్లోనూ వీక్షించవచ్చు. మొత్తంగా 48 మంది అత్యుత్తమ ఉపాధ్యా అవార్డుకు ఎంపికయ్యారు. రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డులను అందుకోనున్నారు.

# అసలు వ్యక్తులను గుర్తించాలి

మొదటి పేజీ తరువాయి

టీపీసీసీ క్రమశిక్షణా కమిటీకి తెలంగాణ మంత్రి కొండా సురేఖ శనివారం మరో లేఖ రాశారు. తనను, కుటుంబ సభ్యులను లక్ష్యంగా చేసుకుని అవమానకర వ్యాఖ్యలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అవమానకర వ్యాఖ్యల వెనుక ఉన్న అసలు వ్యక్తులను గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. వెనుక ఉండి వ్యవహారాన్ని నడిపిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.క్రమశిక్షణా కమిటీ నోటీసుకు ఇప్పటికే వివరణ ఇచ్చానని మంత్రి కొండా సురేఖ తెలిపారు. విచారణ కొనసాగుతుండగానే తనపై బహిరంగ విమర్శలు చేయడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. తన రాజకీయ భవిష్యత్తుపై తీర్పులు ఇవ్వడం, చర్యలు కోరడం వెనుక ఉద్దేశాలను పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. క్రమశిక్షణా కమిటీ స్వతంత్ర నిర్ణయాన్ని ప్రభావితం చేసే ప్రయత్నం జరిగిందా? పరిశీలించాలని సురేఖ కోరారు.సీనియర్ బీసీ మహిళా నాయకురాలిపై సామూహిక దాడులు జరుగుతున్నా పార్టీ మౌనం వహించడం ఆందోళనకరమని మంత్రి సురేఖ వ్యాఖ్యానించారు. పార్టీ ప్రజాస్వామ్య విలువలు, సామాజిక న్యాయం, మహిళా సాధికారతకు విరుద్ధంగా వ్యవహరించేవారిపై చర్యలు తీసుకోవాలని మంత్రి కొండా సురేఖ డిమాండ్ చేశారు.

# తాళ్లూరి బాబు ఆశయాలే స్ఫూర్తి.. సేవా కార్యక్రమాలే వారసత్వం


**మహబూబాబాద్, ఆగస్టు 22 (హైదరాబాద్ పల్స్):** ప్రజల మధ్య జీవిస్తూ నిరుపేదల సంక్షేమానికి సేవలందించిన దివంగత తాళ్లూరి బాబు ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే తమ కుటుంబ లక్ష్యమని ఆయన కుమారుడు తాళ్లూరి గంగాధర్ తెలిపారు.డోర్నకల్ మండలం ఉయ్యాలవాడ గ్రామ శివారులోని తాళ్లూరి బాబు శృతి వనంలో శనివారం ఆయన ఆరో వర్ధంతి కార్యక్రమాన్ని కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అభిమానులు, ఆత్మీయులు, శ్రేయోభిలాషులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని తాళ్లూరి బాబు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా గంగాధర్ మాట్లాడుతూ.. తన తండ్రి జీవితం కుటుంబానికే పరిమితం కాకుండా పేదలు, ఆపదలో ఉన్నవారికి అండగా నిలిచే సేవా భావంతో సాగిందన్నారు. ఆయన నుంచి తమకు అందిన గొప్ప వారసత్వం ఆస్తులు కాదని, ప్రజలకు సేవ చేయాలనే ఆలోచన, అవసరంలో ఉన్నవారికి తోడుగా నిలిచే మానవత్వమని పేర్కొన్నారు.తండ్రి సేవా స్ఫూర్తిని కొనసాగించేందుకు తాళ్లూరి బాబు ట్రస్టును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్టు లోగోను ఆవిష్కరించారు. భవిష్యత్‌లో పార్టీలకు అతీతంగా, కులమత భేదాలు లేకుండా పేదలు, నిరుపేదలు, ఆపదలో ఉన్న కుటుంబాలకు సహాయం అందించేందుకు ట్రస్టు ద్వారా కార్యక్రమాలు చేపడతామని తెలిపారు.విద్య, వైద్యం, ఆర్థిక సహాయం తదితర రంగాల్లో అవసరమైన వారికి అండగా నిలవడంతో పాటు తాళ్లూరి బాబు పేరును కేవలం జ్ఞాపకంగా కాకుండా సామాజిక సేవకు ప్రతీకగా నిలపాలన్నదే కుటుంబ సంకల్పమని గంగాధర్ తెలిపారు.కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచులు, వార్డు సభ్యులు, తాళ్లూరి బాబు అభిమానులు, కుటుంబ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



# మెపా డోర్నకల్ మండల అధ్యక్షుడిగా నవీన్ కుమార్ ముదిరాజ్

**ముదిరాజ్‌ల ఐక్యత కోసం కృషి చేస్తా: నవీన్ కుమార్**

**మహబూబాబాద్, ఆగస్టు 22 (హైదరాబాద్ పల్స్):** ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ తెలంగాణ (మెపా) డోర్నకల్ మండల అధ్యక్షుడిగా డోర్నకల్‌కు చెందిన సీనియర్ జర్నలిస్ట్ మారబోయిన నవీన్ కుమార్ ముదిరాజ్ నియమితులయ్యారు. ఈ మేరకు మెపా వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ ముదిరాజ్ శనివారం నియామకాన్ని ప్రకటించారు.ఈ సందర్భంగా నవీన్ కుమార్ మాట్లాడుతూ డోర్నకల్ మండలంలోని ముదిరాజ్‌ల సమస్యల పరిష్కారానికి, హక్కుల సాధనకు కృషి చేస్తానన్నారు. సమాజంలో ఐక్యతను పెంపొందించడంతో పాటు యువత విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో ముందుకు సాగేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తానని తెలిపారు.మెపా రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ ముదిరాజ్ ఆశయాలు, ఆలోచనా విధానం నచ్చి సంఘంలో చేరినట్లు పేర్కొన్నారు. ఆయన సూచనలు, మార్గదర్శకత్వంతో సమాజ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. తనను మండల



అధ్యక్షుడిగా నియమించిన రాష్ట్ర నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.తన నియామకానికి సహకరించిన కురవి మండల అధ్యక్షుడు పొన్నెబోయిన వెంకన్న ముదిరాజ్, జిల్లా అధ్యక్షుడు దుండి అశోక్, ప్రధాన కార్యదర్శి యాకయ్యలకు నవీన్ కుమార్ ధన్యవాదాలు తెలిపారు. మండలంలోని ముదిరాజ్‌ల సహకారంతో మెపాను మరింత బలోపేతం చేస్తానని పేర్కొన్నారు

# అంబేద్కర్ ఆశయాల సాధనకు కొత్త కమిటీ కృషి

**టతీమహబూబాబాద్, ఆగస్టు 22 (హైదరాబాద్ పల్స్ న్యూస్):** అంబేద్కర్ సేవా సంఘం – డోర్నకల్ నూతన కార్యవర్గం శనివారం కొలువుదీరింది. డోర్నకల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సంఘ సభ్యులు, నాయకుల సమక్షంలో నూతన కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు.కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డోర్నకల్ మున్సిపల్ వైస్ చైర్మన్ కొండేటి రాజకుమారి హరినాథ్ బాబు, న్యాయ సలహాదారు కొప్పుల శంకర్ హాజరై నూతన కార్యవర్గానికి శు భాకాంక్షలు తెలిపారు. ప్రత్యేక ఆహ్వానితుడిగా పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు వెంపటి సీతారాములు పాల్గొన్నారు.నూతన కార్యవర్గంలో గౌరవ అధ్యక్షుడిగా జిల్లా విలియం జాన్సన్, అధ్యక్షుడిగా ఏపూరి రమణ, ప్రధాన కార్యదర్శిగా బి.ఆర్. వీరస్వామి, ఆర్గనైజింగ్



కార్యదర్శిగా మాతంగి అనిల్ కుమార్ ఎంపికయ్యారు. ముఖ్య సలహాదారులుగా కొండేటి హరినాథ్ బాబు, గార రమేష్, ఉపాధ్యక్షుడిగా పేరాల నరసయ్య, కార్యదర్శిగా గాజుల వేణు బాధ్యతలు చేపట్టారు.అంబేద్కర్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు సామాజిక సమానత్వం, హక్కుల పరిరక్షణ, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేయాలని నూతన కమిటీ నిర్ణయించింది. సంఘాన్ని మరింత బలోపేతం చేసి ప్రజా సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామని నూతన కార్యవర్గ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# యాదాద్రి నూతన జిల్లా క్రీడా అధికారులను ఘనంగా సన్మానించిన చెన్న రాజేశ్

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 22, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** యాదాద్రి భువనగిరి జిల్లా నూతన జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి (డివైఎస్‌ఓ)గా బాధ్యతలు చేపట్టిన కే.ధనంజేయులు 'యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్సిటీ' జిల్లా నూతన నోడల్ ఆఫీసర్‌గా నియమితులైన పొన్నగాని కృష్ణమూర్తి గౌడ్‌లను ఎస్‌ఎఫ్‌ఐ మాజీ జిల్లా సహాయ కార్యదర్శి చెన్న రాజేశ్ ఘనంగా సన్మానించారు. డివైఎస్‌ఓ కే.ధనంజేయులు మాట్లాడుతూ... జిల్లా పరిధిలోని క్రీడాకారులు, విద్యార్థులను క్రీడల పరంగా అన్ని విధాలా ప్రోత్సహిస్తామని, యాదాద్రి భువనగిరి జిల్లాను క్రీడా రంగంలో రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలిపేందుకు కృషి చేస్తామని తెలిపారు. పొన్నగాని కృష్ణమూర్తి గౌడ్ మాట్లాడుతూ... జిల్లాలో క్రీడలు, శారీరక విద్యకు మరింత ప్రాధాన్యత కల్పిస్తూ యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకు పాటుపడతామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా చెన్న రాజేశ్ మాట్లాడుతూ... నూతన అధికారుల నేతృత్వంలో యాదాద్రి భువనగిరి జిల్లాలో క్రీడారంగం మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. జిల్లాలోని క్రీడాకారులు, విద్యార్థులకు మెరుగైన అవకాశాలు కల్పిస్తూ ప్రతిభావంతులైన క్రీడాకారులను రాష్ట్ర, జాతీయ స్థాయిలో తీర్చిదిద్దేందుకు నూతన అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన కోరారు.



# పందలం రాజవంశీకుల చేతుల మీదుగా రేగళ్ల సతీష్ రెడ్డికి గౌరవం

**అయ్యప్ప స్వామి సేవలకు 'గురు పురస్కార్-2026' ప్రదానం**




**మహబూబాబాద్, ఆగస్టు 22 (హైదరాబాద్ పల్స్):** డోర్నకల్ మండలం గొల్లచర్ల గ్రామానికి చెందిన గురుస్వామి రేగళ్ల సతీష్ రెడ్డికి ప్రతిష్ఠాత్మక 'గురు పురస్కార్--2026' లభించింది. అయ్యప్ప స్వామి సేవా కార్యక్రమాల్లో ఆయన అందిస్తున్న విశిష్ట సేవలను గుర్తిస్తూ ఈ పురస్కారాన్ని ప్రదానం చేశారు.చిక్కడపల్లిలోని త్యాగరాయ గానసభలో మహాశక్తి సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన పురస్కార కార్యక్రమంలో కేరళ పందలం రాజవంశానికి చెందిన రాజా తిరునల్ సురేష్ వర్మ చేతుల మీదుగా సతీష్ రెడ్డి అవార్డును అందుకున్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కేరళ, కర్ణాటక రాష్ట్రాల నుంచి ఎంపికైన 108 మంది గురుస్వాములను ఈ సందర్భంగా సత్కరించారు.పందలం రాజవంశీకుల చేతుల మీదుగా పురస్కారం అందుకోవడం గర్వకారణంగా ఉందని సతీష్ రెడ్డి తెలిపారు. ఈ గౌరవం అయ్యప్ప స్వామి సేవా కార్యక్రమాలను మరింత అంకితభావంతో కొనసాగించేందుకు ప్రోత్సాహాన్ని అందించిందన్నారు.కార్యక్రమంలో అయ్యప్ప స్వామి భక్తులు, గురుస్వాములతో పాటు కరుణ్ తేజ్ రెడ్డి, రాకేష్ రెడ్డి, రాజేష్, అభినవ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మేడిపల్లి శ్రీ చైతన్య పాఠశాలలో క్యాన్సర్‌పై అవగాహన

**చదువుతో పాటు విద్యార్థుల ఆరోగ్యమే ప్రధానం**

**మేడిపల్లి, ఆగస్టు 22 (హైదరాబాద్ పల్స్ న్యూస్):** విద్యార్థులకు చదువుతో పాటు ఆరోగ్యంపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని శ్రీ చైతన్య విద్యాసంస్థలు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో వక్తలు పేర్కొన్నారు. మేడిపల్లిలోని శ్రీ చైతన్య పాఠశాలలో శనివారం బాలికలకు గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నివారణకు ఉపయోగపడే



హెచ్‌పీవీ టీకాపై అవగాహన కల్పించారు.ప్రభుత్వ వైద్యశాఖ సిబ్బంది ఆధ్వర్యంలో అర్హులైన బాలికలకు హెచ్‌పీవీ టీకాలు అందించారు. భవిష్యత్‌లో క్యాన్సర్ ముప్పును తగ్గించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, టీకా ప్రాధాన్యంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్‌కు విద్య ఎంత ముఖ్యమో ఆరోగ్యం కూడా అంతే ముఖ్యమన్నారు. విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు పాఠశాల యాజమాన్యం నిరంతరం ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు.కార్యక్రమంలో నారాయణగూడ జోన్ ఏజీఎం నూరు మహమ్మద్ అలీ, ఆర్ఐ బండి వెంకటేష్, ప్రిన్సిపల్ మాలతి, కోఆర్డినేటర్ రాజేంద్రప్రసాద్, అకాడమిక్ డీన్ మధుకర్, సి బ్యాచ్ ఇన్‌చార్జ్ మాలతి రావు తదితరులు పాల్గొన్నారు.

# రూ.20 లక్షలతో పంచాయతీ భవన నిర్మాణానికి భూమిపూజ



**నర్సింహులపేట, ఆగస్టు 22 (హైదరాబాద్ పల్స్ న్యూస్):** మండలంలోని వస్త్రుంతండా గ్రామ పంచాయతీలో రూ.20 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న నూతన పంచాయతీ భవన నిర్మాణానికి గ్రామ సర్పంచ్ లూనావత్ జ్యోతి వాసునాయక్ స్థానిక అధికారులతో కలిసి శనివారం భూమిపూజ చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ రాంచందర్ నాయక్ సహకారంతో గ్రామాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు.కార్యక్రమంలో ఎంపీడీవో రాంప్రసాదరావు, ఉపసర్పంచ్ స్వరూప, ఎంపీఓ అశోక్, పీఆర్ ఏఈ సుగుణాకర్, పంచాయతీ కార్యదర్శి రజిత, వార్డు సభ్యులు, గ్రామ పార్టీ అధ్యక్షుడు రమేష్, గ్రామస్థులు పాల్గొన్నారు.

# ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలి

## అఖిలపక్ష తెలంగాణ ఉద్యమకారుల డిమాండ్


**అల్వాల్, ఆగస్టు 22 (హైదరాబాద్ పల్స్ న్యూస్):** తెలంగాణ ప్రభుత్వం ఎన్నికల ప్రణాళికలో పేర్కొన్న విధంగా ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని అఖిలపక్ష తెలంగాణ ఉద్యమకారులు డిమాండ్ చేశారు. అల్వాల్ జేఏసీ ప్రాంగణంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో జేఏసీ నాయకులు పటోళ్ల సురేందర్ రెడ్డి మాట్లాడారు. ఉద్యమకారులకు 250 చదరపు గజాల స్థలం, నెలకు రూ.25 వేల పింఛన్, గుర్తింపు కార్డులు అందిస్తామని ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన అనంతరం ఉద్యమకారుల సమస్యలపై అధ్యయనం చేసేందుకు కె. కేశవరావు కమిటీని ఏర్పాటు చేసిందని తెలిపారు. ఎన్నికల ప్రణాళికలో పేర్కొన్న అంశాలతో పాటు కమిటీ సూచనలను కూడా పూర్తిస్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. 2019 సెప్టెంబర్ 17న ఉద్యమకారుల వేదిక ఏర్పాటు కాగా ప్రస్తుతం 27 సంఘాలు ఉన్నాయని తెలిపారు. స్వాతంత్ర్య సమరయోధులకు అందుతున్న గౌరవం, సౌకర్యాల మాదిరిగానే తెలంగాణ ఉద్యమకారులకు కూడా తగిన గుర్తింపు, గౌరవం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఉద్యమకారులు ఏర్పుల దయాకర్, శోభన్ బాబు, రవి, సురేష్, అనిల్ రాజు, వెంకటేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



# ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకూడదు: జే. రామకృష్ణ

## ప్రభుత్వ భూముల వినియోగం పారదర్శకంగా ఉండాలి

**రసూల్‌పురా, ఆగస్టు 22 (హైదరాబాద్ పల్స్ న్యూస్):** ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ప్రభుత్వ భూముల వినియోగం పారదర్శకంగా ఉండాలని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జే. రామకృష్ణ పేర్కొన్నారు. అధికారిక రికార్డులు, భౌతిక పరిశీలన ఆధారంగా వాస్తవాలను నిర్ధారించాలని కోరారు. తెలంగాణ హైకోర్టులో విచారణలో ఉన్న డబ్ల్యూపీ నంబర్ 24635/2026కు సంబంధించిన అంశంపై శనివారం వార్డు-2 రసూల్‌పురలోని సర్దార్ వల్లభాయ్ పటేల్ నగర్‌ను అడ్వకేట్ కమిషనర్ సందర్శించారు. స్థానికుల పిలుపు మేరకు అక్కడికి చేరుకున్న జే. రామకృష్ణ అడ్వకేట్ కమిషనర్‌కు పలు అంశాలను వివరించి వినతిపత్రం సమర్పించారు. సీజ్ చేసిన వాహనాలను పార్కింగ్ చేస్తున్న రహదారిని స్థానికులు చాలా కాలంగా అనుసంధాన, చేరుకునే మార్గంగా ఉపయోగిస్తున్నారని తెలిపారు. ఈ రహదారి ద్వారా కమ్యూనిటీ హాల్‌తో పాటు ఇతర సామాజిక సదుపాయాలకు ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారని వివరించారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ నగర్‌ను 1978 ప్రాంతంలో అప్పటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ భూమి సేకరించి ఆర్థికంగా బలహీన వర్గాలు, అర్హులైన లబ్ధిదారులకు నివాస సౌకర్యం కల్పించే ఉద్దేశంతో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం వాహనాల పార్కింగ్‌కు వినియోగిస్తున్న భూమి లేదా రహదారికి సంబంధించి ప్రభుత్వ ఉత్తర్వులు, కేటాయింపు ఉత్తర్వులు, ఆమోదిత ప్రణాళిక, హద్దుల నిర్ధారణ రికార్డులు, సంబంధిత అధికారుల అనుమతులు ఉన్నాయా అనే విషయాన్ని అధికారిక రికార్డుల ద్వారా పరిశీలించాలని కోరారు. 2003-2005 ప్రాంతంలో సుమారు 19 మంది లబ్ధిదారులకు గృహ పట్టాలు ఇచ్చినట్లు సమాచారం ఉందని, అయితే కమ్యూనిటీ హాల్, బహిరంగ స్థలం అవసరాల కారణంగా ఆ ప్రాంతంలో ఇళ్ల నిర్మాణ ప్రతిపాదన అమలు కాలేదని తెలిపారు. ఈ అంశాన్ని రెవెన్యూ, హెచ్ఎండీఏ రికార్డుల ద్వారా ధ్రువీకరించాలని సూచించారు. పోలీస్ శాఖకు కేటాయించిన భూమి హద్దులు, విస్తీర్ణం, ప్రస్తుత వినియోగం, ప్రజలు ఉపయోగిస్తున్న రహదారి, కమ్యూనిటీ స్థలాల మధ్య తేడాను అధికారిక రికార్డుల ఆధారంగా నిర్ధారించాలని కోరారు. ప్రజలను ఇబ్బందులకు గురిచేయకుండా, ఎన్నో సంవత్సరాలుగా వారు ఉపయోగిస్తున్న రహదారి, కమ్యూనిటీ అవసరాల స్థలాన్ని ఇతర అవసరాలకు వినియోగించే ముందు సంబంధిత కేటాయింపు, రెవెన్యూ, హెచ్ఎండీఏ, సర్వే, హద్దుల నిర్ధారణ రికార్డులను పరిశీలించి వాస్తవాలను నిర్ధారించాలని జే. రామకృష్ణ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు.





## గురువుల విలువను గుర్తించి..

# విద్యార్థుల్లో సంస్కారాన్ని పెంచాలి

**నల్గొండ ఘటన బాధాకరం.. యువతలో క్రమశిక్షణ, మానవీయ విలువలు అవసరం**

**డీఎస్ శ్రీనివాస్ యాదవ్**

**మహబూబాబాద్, ఆగస్టు 22 (హైదరాబాద్ పల్స్ న్యూస్):** నల్గొండ జిల్లాలో ఉపాధ్యాయురాలిపై విద్యార్థులు హత్యకు పాల్పడిన ఘటన అత్యంత బాధాకరమని డోర్నకల్ పట్టణ యాదవ్ సంఘ నాయకుడు దేశబోయిన శ్రీనివాస్ యాదవ్ అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ సమాజానికి విద్యాబుద్ధులు నేర్పే గురువుల పట్ల విద్యార్థుల్లో గౌరవం తగ్గిపోవడం ఆందోళన కలిగించే పరిణామమన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కుటుంబం, విద్యాసంస్థలు, సమాజం కలిసి విద్యార్థుల్లో నైతిక విలువలు, సహనం, క్రమశిక్షణ పెంపొందించాలని సూచించారు. తల్లిదండ్రులు పిల్లలకు జన్మనిస్తే ఉపాధ్యాయులు వారి భవిష్యత్తుకు బాటలు వేస్తారని పేర్కొన్నారు. తన జీవితంలో కూడా గురువుల సూచనలు, బోధనలు ఎంతో ప్రభావం చూపాయని తెలిపారు. మార్కులతో పాటు మంచి సంస్కారం అవసరం విద్యార్థులు చదువులో ప్రతిభ చూపడంతో పాటు మంచి వ్యక్తిత్వాన్ని అలవర్చుకోవడం కూడా ముఖ్యమన్నారు. పెద్దలను గౌరవించడం, గురువులను ఆదరించడం, తోటి వారితో మర్యాదగా మెలగడం, తప్పులను గుర్తించి సరిదిద్దుకోవడం వంటి విలువలను చిన్ననాటి నుంచే అలవాటు చేయాలని సూచించారు. యువతలో పెరుగుతున్న ఆవేశం, అసహనం, చెడు వ్యసనాలు, సామాజిక మాధ్యమాల ప్రభావంపై తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని కోరారు. పిల్లలతో స్నేహపూర్వకంగా మెలిగి వారి సమస్యలను తెలుసుకోవడంతో పాటు వారి ప్రవర్తనలో వచ్చే మార్పులను గమనించాలని సూచించారు.



**హింసకు దూరంగా.. చర్చలతో సమస్యలకు పరిష్కారం**

విద్యార్థులకు సమస్యలు ఎదురైనప్పుడు ఆవేశానికి లోనై హింసకు పాల్పడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా సంబంధిత అధికారులను ఆశ్రయించాలని శ్రీనివాస్ యాదవ్ సూచించారు. పాఠశాలలు, కళాశాలల్లో క్రమశిక్షణతో పాటు మానవీయ విలువలు, బాధ్యతాయుత ప్రవర్తనపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు.

**గణేష్ నవరాత్రులను ప్రశాంతంగా నిర్వహించాలి**

రానున్న గణేష్ నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని కోరారు. ఉత్సవాలు ప్రజల్లో ఐక్యత, సోదరభావాన్ని పెంపొందించేలా ఉండాలని అన్నారు. ఉత్సవ కమిటీలు ముందస్తు ప్రణాళికతో కార్యక్రమాలు నిర్వహించి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అధిక శబ్దాలతో ప్రజలకు ఇబ్బందులు కలిగించకుండా భక్తి, ఆధ్యాత్మిక కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇవ్వాలని, వృద్ధులు, చిన్నారులు, విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా పోలీసు, మున్సిపల్ అధికారుల సూచనలు పాటించాలని కోరారు. గురువుల పట్ల గౌరవం, తల్లిదండ్రుల పట్ల బాధ్యత, సమాజం పట్ల సేవాభావాన్ని విద్యార్థుల్లో పెంపొందించడంతో పాటు పండుగలను క్రమశిక్షణతో నిర్వహించడం ద్వారా సమాజానికి మంచి సందేశం ఇవ్వాలని డీఎస్ శ్రీనివాస్ యాదవ్ పిలుపునిచ్చారు.

# మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించిన మెగా యూత్ ఫోర్స్

## పలు ప్రాంతాల్లో కేక్ కటింగ్, సేవా కార్యక్రమాలు

**పటాన్‌చెరు, ఆగస్టు 22 (హైదరాబాద్ పల్స్ న్యూస్):** మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలను తెలంగాణ మెగా యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. మెగా యూత్ ఫోర్స్ వెస్ట్ జోన్ కన్వీనర్ దంగేటి సత్యనారాయణ పర్యవేక్షణలో పలు ప్రాంతాల్లో కేక్ కటింగ్‌తో పాటు సేవా కార్యక్రమాలు చేపట్టారు. మియాపూర్‌లోని సాయిరంగా థియేటర్ వద్ద 50 అడుగుల చిరంజీవి భారీ కటౌట్ ఏర్పాటు చేసి వేడుకలను ప్రారంభించారు. అనంతరం జూబ్లీహిల్స్ జ్యోతి థియేటర్, అశోక్‌నగర్, పటాన్‌చెరు అంబేద్కర్ విగ్రహం, ఇస్నాపూర్ చౌరస్తా, రుద్రారం గణేష్‌గడ్డ తదితర ప్రాంతాల్లో అభిమానులు సంబరాలు నిర్వహించారు. సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని సందర్శించి కేక్ కట్ చేశారు. జోగిపేట మండల పరిషత్ పాఠశాలలో విద్యార్థుల కోసం వాటర్ ప్యూరిఫైయర్‌ను అందజేశారు. విద్యార్థులకు పెన్నులు, మిఠాయిలు పంపిణీ చేశారు. అనంతరం బొల్లారంలో కేక్ కటింగ్, కౌసల్యనగర్‌లో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని సందర్శించారు. కార్యక్రమాల్లో మెగా యూత్ ఫోర్స్ కన్వీనర్ దంగేటి సత్యనారాయణతో పాటు మెగా అభిమానులు శివరాజు, శర్మ, రామారావు, బుజ్జి, గణపతిరావు, సుబ్బారావు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.






# చిలుకోడులో పెద్దమ్మ తల్లి బోనాలకు సర్వం సిద్ధం

## ఆదివారం అమ్మవారి సేవలో తరలిరానున్న భక్తులు



**మహబూబాబాద్, ఆగస్టు 22 (హైదరాబాద్ పల్స్ న్యూస్):** డోర్నకల్ మండలం చిలుకోడు గ్రామంలో పెద్దమ్మ తల్లి బోనాల వేడుకలకు ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆదివారం నిర్వహించనున్న వేడుకలను భక్తిశ్రద్ధలతో జరిపేందుకు ఆలయ పరిసరాల్లో అన్ని ఏర్పాట్లు చేసినట్లు ప్రధాన అర్చకుడు పిట్టల వెంకన్న తెలిపారు. గ్రామంతో పాటు పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారికి మొక్కులు చెల్లించుకోవాలని కోరారు. పెద్దమ్మ తల్లి బోనాల వేడుకలను కులమతాలకు అతీతంగా నిర్వహిస్తున్నామని, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఆదివారం సాయంత్రం 3 గంటలకు మహిళలు బోనాలతో పెద్దమ్మ తల్లి ఆలయానికి చేరుకోవాలని సూచించారు. బోనాలు సమర్పించిన అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పెద్దమ్మ తల్లి ఆశీస్సులతో గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

# కూకట్‌పల్లి కేపీహెచ్‌బీలో ఉచిత రక్తదాన శిబిరం

## చిరంజీవి 71వ జన్మదినోత్సవం సందర్భంగా నిర్వహణ








**కూకట్‌పల్లి, ఆగస్టు 22 (హైదరాబాద్ పల్స్ న్యూస్):** కూకట్‌పల్లి నియోజకవర్గం కేపీహెచ్‌బీ 3వ ఫేజ్‌లోని రామ్యా గ్రౌండ్స్‌లో చిరంజీవి 71వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం ఉచిత రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. సందీప్ ధనపాల్, అరవింద్ చెర్రీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రక్తదానం ద్వారా ఆపదలో ఉన్న అనేక మంది ప్రాణాలను కాపాడవచ్చన్నారు. యువత స్వచ్ఛందంగా రక్తదాన కార్యక్రమాల్లో పాల్గొనడం అభినందనీయమని తెలిపారు. చిరంజీవి సేవా స్ఫూర్తితో నిర్వహించిన ఈ శిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించిందన్నారు. శిబిరంలో యువత, అభిమానులు, స్థానిక ప్రజలు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు మందాడి శ్రీనివాస్ రావు, తూము శ్రావణ్ కుమార్, కూకట్‌పల్లి నియోజకవర్గ సమన్వయకర్త సతీష్ అరోరా, రాజేష్ రాయ్, పాతూరి గోపి, జున్ను సాయి శ్రీనివాస్, వాలా వాలా నాయుడు, రాంబాబు నాయుడు, ఉపేందర్ రెడ్డి, జి.ఎల్.ఎన్. రెడ్డి, తులసి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అనారోగ్యంతో విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుడు మృతి



**నర్సింహులపేట, ఆగస్టు 22 (హైదరాబాద్ పల్స్ న్యూస్):** ముంగిమడుగు విద్యుత్ ఉపకేంద్రం పరిధిలో కాంట్రాక్ట్ కార్మికుడిగా పనిచేస్తున్న గూగులోతు నాగేష్ (43) అనారోగ్యంతో శనివారం మృతి చెందాడు. నర్సింహపురం బంజర శివారులోని పత్తితండాకు చెందిన నాగేష్ కొన్నేళ్లుగా విద్యుత్ శాఖలో కాంట్రాక్ట్ పద్ధతిలో విధులు నిర్వహిస్తున్నాడు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయనను శుక్రవారం రాత్రి హైదరాబాద్‌కు తరలిస్తుండగా మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. నాగేష్ మృతితో పత్తితండాలో విషాదఛాయలు అలుముకున్నాయి.

# సుభాష్‌నగర్ స్టీల్ బ్రిడ్జి పనులు వేగవంతం చేయాలి

## ఆకుల సతీష్ అండ్ టీమ్ డిమాండ్



**కుత్బుల్లాపూర్, ఆగస్టు 22 (హైదరాబాద్ పల్స్ న్యూస్):** సుభాష్‌నగర్ స్టీల్ బ్రిడ్జి నిర్మాణ పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆకుల సతీష్ అండ్ టీమ్ డిమాండ్ చేసింది. శనివారం బ్రిడ్జి నిర్మాణ పనులను పరిశీలించిన బృందం, గత ఎనిమిది నెలలుగా పనులు నత్తనడకన సాగుతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొంది. కుత్బుల్లాపూర్ గ్రామం, అయోధ్యనగర్ చౌరస్తా నుంచి సుచిత్ర వరకు ప్రతిరోజూ భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడుతోందని, ఉదయం, సాయంత్రం వేళల్లో సమస్య మరింత తీవ్రంగా ఉంటోందని తెలిపింది. బ్రిడ్జి పనులు పూర్తయితే ట్రాఫిక్ సమస్యకు గణనీయమైన పరిష్కారం లభిస్తుందని పేర్కొంది. బ్రిడ్జి ప్రణాళికలో పలుమార్లు మార్పులు చేయడం వల్ల పనుల్లో జాప్యం జరిగిందని స్థానికులు ఆరోపిస్తున్నారని బృందం తెలిపింది. జోనల్ కమిషనర్ ప్రత్యేక చొరవ తీసుకుని అధికారులతో సమన్వయం చేసి పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయించాలని కోరింది. ఈ కార్యక్రమంలో ఆకుల సతీష్, నల్ల జై శంకర్ గౌడ్, పులి బలరాం, కంది శ్రీరాములు, హనుమాన్ జీ తదితరులు పాల్గొన్నారు.

# రసూల్‌పురలో ఉచిత వైద్య శిబిరంను ప్రారంభించిన ఎమ్మెల్యే శ్రీగణేష్



**రసూల్‌పుర, ఆగస్టు 22 (హైదరాబాద్ పల్స్ న్యూస్):** వార్డు-2 రసూల్‌పురలోని మార్గదర్శిని కాలనీ జైన్ మందిర్ కమ్యూనిటీ హాల్‌లో జన హిత ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ శనివారం ప్రారంభించారు. మార్గదర్శిని కాలనీ అసోసియేషన్ సహకారంతో ఈ శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో స్థానికులకు ఉచిత వైద్య పరీక్షలతో పాటు రక్తపోటు, మధుమేహం, కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యం అత్యంత ముఖ్యమని, ఇలాంటి వైద్య శిబిరాలు పేద, మధ్యతరగతి ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని అన్నారు. జన హిత ట్రస్ట్, మార్గదర్శిని కాలనీ అసోసియేషన్ సేవలను అభినందించారు. నియోజకవర్గంలోని అన్ని వార్డుల్లో ఇలాంటి వైద్య శిబిరాలు నిర్వహించేందుకు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో జన హిత ట్రస్ట్ సభ్యులు, మార్గదర్శిని కాలనీ అసోసియేషన్ సభ్యులు, వైద్యులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

# మంత్రి దామోదర రాజనర్సింహను కలిసిన ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య

## ఆలేరు నియోజకవర్గం, యాదాద్రి జిల్లాలో వైద్య, ఆరోగ్య రంగానికి సంబంధించిన అభివృద్ధి అంశాలపై చర్చ



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 22, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** తెలంగాణ రాష్ట్ర వైద్య, ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ, శాస్త్ర సాంకేతిక శాఖల మంత్రి దామోదర రాజనర్సింహని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామివారి లడ్డు ప్రసాదాన్ని మంత్రి దామోదర రాజనర్సింహకి అందజేశారు. అనంతరం ఆలేరు నియోజకవర్గంతో పాటు యాదాద్రి భువనగిరి జిల్లాలో చేపట్టాల్సిన పలు అభివృద్ధి కార్యక్రమాలు, ముఖ్యంగా వైద్య, ఆరోగ్య రంగానికి సంబంధించిన అంశాలపై ఇరువురు చర్చించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా అవసరమైన చర్యలు చేపట్టాలని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య మంత్రి దృష్టికి పలు అంశాలను తీసుకెళ్లారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర రాజనర్సింహ సానుకూలంగా స్పందించి, ప్రజా సంక్షేమానికి సంబంధించిన అంశాలకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు.

# చిన్నగూడూరు సమస్యలపై ఎమ్మెల్యేను నిలదీసిన ఎడ్ల మల్లయ్య

## నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టి పెట్టాలి. సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ

**మహబూబాబాద్, ఆగస్టు 22 (హైదరాబాద్ పల్స్ న్యూస్):** డోర్నకల్ నియోజకవర్గంలో ప్రజా సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కమిటీ సభ్యుడు ఎడ్ల మల్లయ్య ఆరోపించారు. శనివారం చిన్నగూడూరు మండలం ఉగ్గంపల్లి గ్రామంలో ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే డాక్టర్ రామచంద్రనాయక్‌పై విమర్శలు చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం కంటే మంత్రి పదవి కోసం అధిష్ఠానం చుట్టూ తిరగడానికే ఎమ్మెల్యే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారని ఆరోపించారు. నియోజకవర్గానికి ప్రత్యేక నిధులు తీసుకురావడంలో విఫలమయ్యారని విమర్శించారు. ఎన్నికల సమయంలో చిన్నగూడూరు మండలాన్ని దత్తత తీసుకుంటానని ఇచ్చిన హామీ ఇప్పటివరకు అమలుకు నోచుకోలేదన్నారు.

**సాగునీటి సమస్యలపై ఆగ్రహం**

చిన్నగూడూరు మండలంలోని ఆకేరువాగు ఆనకట్ట దెబ్బతిని ఏళ్లు గడుస్తున్నా మరమ్మతులు చేపట్టకపోవడం రైతుల పట్ల నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. చెక్‌డ్యామ్ నిర్మాణంపై ఇచ్చిన హామీ కూడా అమలు కాలేదని పేర్కొన్నారు. తుమ్మిడిచెరువు కట్ట దెబ్బతినడం, పెద్దచెరువులో నీరు లేకపోవడంతో రైతులు సాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.



**ప్రభుత్వ కార్యాలయాలకు శాశ్వత భవనాలు నిర్మించాలి**

చిన్నగూడూరు కంటే తరువాత ఏర్పడిన మండలాలకు తహసీల్దార్ కార్యాలయాలు, ఇతర ప్రభుత్వ కార్యాలయాలు మంజూరవుతున్నప్పటికీ ఇక్కడ శాశ్వత ప్రభుత్వ భవనాల కొరత కొనసాగుతోందని మల్లయ్య అన్నారు. దాశరథి సోదరుల జన్మస్థలమైన ఈ ప్రాంత అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. పేదలకు ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో అర్హులకు అన్యాయం జరుగుతోందని ఆరోపించారు. గ్రామాల్లో కార్మికులు, రైతులు, పేదలు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రజా సంఘాలు వినతిపత్రాలు సమర్పిస్తున్నా పరిష్కారానికి చొరవ కనిపించడం లేదన్నారు. ఎమ్మెల్యే క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటించి ప్రజల సమస్యలను స్వయంగా తెలుసుకోవాలని మల్లయ్య సూచించారు. మంత్రి పదవి కోసం చూపుతున్న ఆసక్తిలో కొంతైనా నియోజకవర్గ అభివృద్ధిపై చూపించి ఆనకట్టలు, చెక్‌డ్యామ్‌లు, చెరువులు, ప్రభుత్వ భవనాల నిర్మాణానికి అవసరమైన నిధులు తీసుకురావాలని డిమాండ్ చేశారు.


# ఘనంగా అయ్యప్ప మంత్రదీక్ష-మంత్రోపదేశ మహోత్సవం

**కేరళ తంత్ర సంప్రదాయంలో రెండు రోజుల ఆధ్యాత్మిక కార్యక్రమం**

**తొలిసారిగా కేరళ తాంత్రిక సంప్రదాయంలో అయ్యప్ప పూజా భక్తుల సమ్మేళనం**

**మంత్రోపదేశం తీసుకునేందుకు సెప్టెంబర్ 4వ తేదీలోపు నమోదు చేసుకోవాలి**

**కుత్బుల్లాపూర్, ఆగస్టు 22 (హైదరాబాద్ పల్స్ న్యూస్):** అయ్యప్ప భక్తులకు ఆధ్యాత్మికంగా విశిష్టమైన అవకాశాన్ని కల్పించే ఉద్దేశంతో కేరళ తంత్ర సంప్రదాయ అయ్యప్ప మంత్రదీక్ష, మంత్రోపదేశ మహోత్సవాన్ని హైదరాబాద్‌లో సెప్టెంబర్ 6, 7 తేదీల్లో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గుడ్లపోచంపల్లిలోని ఏవీఆర్ కన్వెన్షన్ హాల్‌లో జరిగే ఈ కార్యక్రమంలో దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి అయ్యప్ప భక్తులు పాల్గొననున్నారు. కేరళలోని చెంగన్నూర్ మంత్ర విద్యాపీఠానికి చెందిన తాంత్రిక గురువుల ఆధ్వర్యంలో సంప్రదాయ పూజలు, హోమాలు, అభిషేకం, మంత్రోపదేశం తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నారు. బ్రహ్మశ్రీ టి.డి.పి. నంబూద్రి గురూజీ ఆధ్వర్యంలో ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. సెప్టెంబర్ 6న ఇప్పటికే శిక్షణ పొందుతున్న విద్యార్థులకు ప్రాయోగిక శిక్షణతో పాటు అయ్యప్ప భజన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. సెప్టెంబర్ 7న మంత్రోపదేశం కోసం నమోదు చేసుకున్న భక్తులకు ప్రధాన కార్యక్రమం నిర్వహించనున్నారు. మంత్రోపదేశం పొందాలనుకునే వారు సెప్టెంబర్ 4లోపు నమోదు చేసుకోవాలని సూచించారు. మహాగణపతి హోమం, పితృ వందనం, కలశ పూజ, అభిషేకం, మాతృ వందనం, మంత్రదీక్ష, మంత్రోపదేశం తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అయ్యప్ప ఆరాధనా విధానాలపై భక్తులకు అవగాహన కల్పించడం, గురువు మార్గదర్శకత్వంలో ఆధ్యాత్మిక సాధనకు అవకాశం కల్పించడం కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. భక్తుల సౌకర్యార్థం పరిమిత సంఖ్యలో వసతి సదుపాయం కల్పిస్తున్నామని, సుమారు 30 మందికి మాత్రమే వసతి అవకాశం ఉన్నందున ముందుగా నమోదు చేసుకోవాలని నిర్వాహకులు సూచించారు. అయ్యప్ప భక్తులు, స్వాములు, ఆధ్యాత్మిక సాధకులు కార్యక్రమంలో పాల్గొని గురువుల ఆశీస్సులు పొందాలని నిర్వాహకులు కే. నిరంజన్ రావు కోరారు.



# అమీన్పూర్‌లో రూ.8.19 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన

## ప్రతి కాలనీని ఆదర్శంగా తీర్చిదిద్దడమే లక్ష్యం : ఎమ్మెల్యే జీఎంఆర్

**అమీన్పూర్, ఆగస్టు 22 (హైదరాబాద్ పల్స్ న్యూస్):** అమీన్పూర్ డివిజన్ పరిధిలోని ప్రతి కాలనీని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేసి ఆదర్శ కాలనీలుగా తీర్చిదిద్దడమే లక్ష్యమని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. శనివారం అమీన్పూర్ డివిజన్‌లోని రాజేంద్రరెడ్డి కాలనీ, సాయి అంబిక కాలనీ, పీఎన్ఆర్ కాలనీ, నరేంద్రనగర్, సాయిరామ్ ఎంక్లేవ్, శంకర్ గ్రీన్ హోమ్స్, బృందావన్ టీచర్స్ కాలనీ, నవ్య నందనవనం, నర్రేగూడెం రాజీవ్ గృహకల్ప కాలనీల్లో మొత్తం రూ. 8.19 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్లు, అంతర్గత మురుగు కాలువల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కాలనీల ప్రజలు, సంక్షేమ సంఘాల ప్రతినిధులతో సమావేశమై స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రహదారులు, మురుగు కాలువలు, తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్య సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అమీన్పూర్‌లో దశాబ్దాలుగా ఉన్న తాగునీటి సమస్యను పరిష్కరించామని, కొత్తగా ఏర్పడుతున్న కాలనీలకు కూడా తాగునీరు అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. ప్రభుత్వ స్థలాలు, పార్కులు ఆక్రమణలకు గురికాకుండా చర్యలు తీసుకుంటున్నామని, పార్కుల అభివృద్ధి, పచ్చదనం పెంపుపై దృష్టి సారిస్తున్నామని పేర్కొన్నారు. పెరుగుతున్న విద్యుత్ అవసరాలకు అనుగుణంగా నూతన విద్యుత్ ఉపకేంద్రాలు, అదనపు విద్యుత్ పరివర్తకాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. అభివృద్ధి పనుల నాణ్యతను ప్రజలు కూడా పర్యవేక్షించాలని కోరారు. ప్రతి కాలనీలో మౌలిక వసతులు కల్పించి మెరుగైన జీవన ప్రమాణాలు అందించడమే లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అమీన్పూర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ప్రదీప్ కుమార్, మాజీ ఎంపీపీ దేవానందం, అధికారులు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.





# ఆలేరు ప్రెస్ క్లబ్ నూతన భవనానికి భూమిపూజ

**ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య సహకారంతో ఆలేరు ప్రెస్ క్లబ్ భవన నిర్మాణ పనులు**

**వెల్లడించిన.. ఆలేరు ప్రెస్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు ఎండి కుర్షిద్ పాషా, జంపాల దశరథ**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 22, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** ఆలేరు జర్నలిస్టుల చిరకాల ఆకాంక్షకు ఎట్టకేలకు శ్రీకారం చుట్టారు. ఆలేరు ప్రెస్ క్లబ్ నూతన భవన నిర్మాణానికి శనివారం ఆలేరు పట్టణం లోని 1026 ప్రభుత్వ భూమిలో ఘనంగా భూమి పూజ నిర్వహించారు. ప్రెస్ క్లబ్ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించి నిర్మాణ పనులను ప్రారంభించారు. జర్నలిస్టుల సమావేశాలు, ప్రెస్‌మీట్లు, మీడియా సమావేశాలు, ఇతర కార్యక్రమాలను నిర్వహించుకునేందుకు అనువుగా అన్ని సౌకర్యాలతో నూతన భవనాన్ని నిర్మించనున్నట్లు ప్రెస్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు ఎండి కుర్షిద్ పాషా, జంపాల దశరథ తెలిపారు. ఆలేరు స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య సహకారంతో భవన నిర్మాణ పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.




నూతన ప్రెస్ క్లబ్ భవనం అందుబాటులోకి వస్తే ఆలేరు జర్నలిస్టులకు శాశ్వత వేదికగా నిలవడంతో పాటు, ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు మరింత ఉపయోగకరంగా ఉంటుందని సభ్యులు పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షులు కొరుటూరు ఉపేందర్, కూల సిద్దుల, గుండు మహేందర్, కోశాధికారి ముళ్ళకల రవి, కార్యదర్శి చింతకింది వెంకటేష్, పోతుగంటి సంపత్, గౌరవ సలహాదారులు మంచన మల్లేశం, సందెన శంకర్, సభ్యులు శనిగరం శ్రీనివాస్, ఎండీ జహంగీర్, కోల ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

# సంగారెడ్డి జిల్లా పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎ. జనార్ధన్

**ఏకగ్రీవంగా ఎన్నికైన నూతన కార్యవర్గం**









**సంగారెడ్డి, ఆగస్టు 22 (హైదరాబాద్ పల్స్ న్యూస్):** సంగారెడ్డి జిల్లా పోలీస్ అసోసియేషన్ ఎన్నికల ప్రక్రియ ఏకగ్రీవంగా పూర్తైంది. జిల్లా పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడిగా హెడ్ కానిస్టేబుల్ ఎ. జనార్ధన్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా ఇన్‌స్పెక్టర్ బి. రమేష్, ఎస్ఐ బి. నాగలక్ష్మి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఐపీఎస్ మాట్లాడుతూ పోలీస్ సిబ్బంది సంక్షేమం, సమస్యల పరిష్కారంలో పోలీస్ అసోసియేషన్ కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. సిబ్బంది సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంలో అసోసియేషన్ వారధిగా పనిచేయాలని సూచించారు. ఓటింగ్ అవసరం లేకుండా పోలీస్ సిబ్బంది పరస్పర సమన్వయం, సహకారంతో ఎన్నికల ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయడం అభినందనీయమన్నారు. నూతన కార్యవర్గ సభ్యులు బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ సిబ్బంది సమస్యల పరిష్కారం, హక్కులు, సంక్షేమ కార్యక్రమాల అమలుకు కృషి చేయాలని ఆకాంక్షించారు. నూతన కార్యవర్గంలో ప్రధాన కార్యదర్శిగా రాజశేఖర్ రెడ్డి, సంయుక్త కార్యదర్శిగా ఎం. రాజారామ్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా జి. సంతోష్ కుమార్, ఖజానాదారుగా కూన రమేష్ ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా అబ్దుల్ కరీమ్, టి. వెంకటేశం, పి. అరుణ కుమారి, అంగోథ్ రమేష్, ముజామిల్, జి. శ్రీనివాస్ తదితరులు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి, డీఎస్పీ సురేందర్ రెడ్డి, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ సదా నాగరాజు, పోలీస్ అసోసియేషన్ ప్రతినిధులు, అధికారులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# రేషన్ బియ్యం అమ్మితే కార్డు రద్దు.. డీలర్లకూ కఠిన హెచ్చరిక

**లబ్ధిదారులు, రేషన్ డీలర్లు అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరిక**

**తెలంగాణ బ్యూరో, ఆగస్టు 22,(హైదరాబాద్ పల్స్ ప్రతినిధి):** తెలంగాణలో ఉచితంగా పంపిణీ చేస్తున్న సన్నబియ్యాన్ని అక్రమంగా విక్రయించే లబ్ధిదారులు, కొనుగోలు చేసే వ్యాపారులు, రేషన్ డీలర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని పౌరసరఫరాల శాఖ హెచ్చరించింది. పేదల ఆహార అవసరాల కోసం ప్రభుత్వం అందిస్తున్న బియ్యాన్ని వ్యాపారంగా మార్చడాన్ని సహించబోమని స్పష్టం చేసినట్లు సమాచారం. కొన్ని ప్రాంతాల్లో రేషన్ బియ్యం పంపిణీ సమయంలోనే దళారులు లబ్ధిదారుల నుంచి బియ్యాన్ని కొనుగోలు చేస్తున్నట్లు అధికారులు గుర్తించినట్లు తెలుస్తోంది. కొందరు లబ్ధిదారులు రేషన్ దుకాణాల వద్దే బియ్యాన్ని వదిలి, కిలోకు రూ. 10 నుంచి రూ. 15 వరకు తీసుకుంటున్నట్లు సమాచారం. మరోవైపు రేషన్ డీలర్లు, దళారులు బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న




ఘటనలపై కూడా నిఘా పెంచినట్లు తెలుస్తోంది. నిల్వల్లో తేడాలు కనిపించినా, బియ్యం అక్రమ రవాణా లేదా ఇతర అక్రమాలకు పాల్పడినా సంబంధిత డీలర్లపై చర్యలు తీసుకోనున్నట్లు అధికారులు హెచ్చరిస్తున్నారు.

**రేషన్ కార్డు శాశ్వత రద్దు**

లబ్ధిదారులు ఉచితంగా పొందిన బియ్యాన్ని విక్రయించినట్లు ఆధారాలతో నిర్ధారణ అయితే వారి రేషన్ కార్డును శాశ్వతంగా రద్దు చేసే అవకాశం ఉందని అధికారులు హెచ్చరించారు. వరుసగా ఆరు నెలల పాటు రేషన్ సరుకులు తీసుకోని కార్డుదారులను కూడా అనర్హులుగా గుర్తించే చర్యలు ఉంటాయని తెలిపారు.

**డీలర్లపై కేసులు**

రేషన్ దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి బియ్యం నిల్వలు, పంపిణీ వివరాలను పరిశీలించనున్నట్లు సమాచారం. అక్రమాలకు పాల్పడినట్లు తేలితే డీలర్‌షిప్ రద్దుతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేసే అవకాశం ఉంది. ప్రభుత్వ పథకం ద్వారా పేదలకు అందుతున్న బియ్యాన్ని విక్రయించకుండా, అర్హులైన లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు.

# భారత్‌పై పాక్ మంత్రి సంచలన వ్యాఖ్యలు..'నీటిని ఆయుధంగా వాడే ముప్పు'!

**సింధు జలాల ఒప్పందం విషయంలో భారత్ వైఖరిపై అహ్సాన్ ఇక్బాల్ విమర్శలు**

**ఆగస్టు 22, ఇస్లామాబాద్ (హైదరాబాద్ పల్స్ ప్రతినిధి):** సింధు జలాల ఒప్పందం విషయంలో భారత్ అనుసరిస్తున్న వైఖరిపై పాకిస్థాన్ ప్రభుత్వ మంత్రి అహ్సాన్ ఇక్బాల్ విమర్శలు చేశారు. భారత్ ఎగువ దేశంగా ఉండటంతో నదుల నీటిని తమకు వ్యతిరేకంగా ఆయుధంగా ఉపయోగించే అవకాశం ఉందని ఆరోపించారు. దక్షిణాసియాలో శాంతి, స్థిరత్వానికి భారత్ పాత్ర కీలకమని ఇక్బాల్ పేర్కొన్నారు. ప్రాంతీయ స్థిరత్వానికి విఘాతం కలిగించే చర్యలకు భారత్ దూరంగా ఉండాలని సూచించారు. సింధు జలాల విషయంలో భారత్ తీసుకున్న నిర్ణయంతో పాకిస్థాన్‌కు నీటి భద్రతపై




ఆందోళన పెరిగిందని తెలిపారు.

**ఒప్పందం నిలిపివేతపై వివాదం**

పహల్గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో భారత్ 1960లో కుదిరిన సింధు జలాల ఒప్పందాన్ని నిలిపివేసిన విషయం తెలిసిందే. ఈ నిర్ణయంపై పాకిస్థాన్ అంతర్జాతీయ వేదికలపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తోంది. సింధు నదీ వ్యవస్థకు సంబంధించిన నీటి పంపిణీపై ఇరు దేశాల మధ్య దీర్ఘకాలంగా కొనసాగుతున్న ఒప్పందాన్ని పునరుద్ధరించే విషయంలో భారత్ తన వైఖరిని కొనసాగిస్తోంది. మరోవైపు ఈ అంశాన్ని అంతర్జాతీయ వేదికలపై ప్రస్తావిస్తూ భారత్‌పై ఒత్తిడి తీసుకురావడానికి పాకిస్థాన్ ప్రయత్నిస్తోంది. గతంలో పాకిస్థాన్‌లో సంభవించిన వరదలకు కూడా భారత్‌ను బాధ్యుడిగా పేర్కొంటూ అహ్సాన్ ఇక్బాల్ ఆరోపణలు చేశారు. భారత్ నీటిని ఆయుధంగా ఉపయోగిస్తోందన్న ఆరోపణలను ఆయన మరోసారి ప్రస్తావించారు.

# ఆగస్టు 23 అర్ధరాత్రి నుంచి ఆటో, మోటార్ రవాణా బంద్‌కు పిలుపు

**మేడ్చల్, ఆగస్టు 22(హైదరాబాద్ పల్స్ ప్రతినిధి):** రవాణా రంగ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆగస్టు 23 అర్ధరాత్రి నుంచి తెలంగాణవ్యాప్తంగా ఆటోలు, టాక్సీలు, ఇతర రవాణా వాహనాల బంద్ నిర్వహించనున్నట్లు టీయూసీఐ, ఏఐటీయూసీ, సీఐటీయూ, బీఎంఎస్ నాయకులు తెలిపారు. బంద్‌ను విజయవంతం చేయాలని ఆటో, మోటార్ కార్మికులకు పిలుపునిచ్చారు. మేడ్చల్‌లో నిర్వహించిన జిల్లా సదస్సులో నాయకులు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని, రవాణా రంగ కార్మికుల కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో ఆటో మీటర్ చార్జీలు పెంచడంతో పాటు ఆటో నిర్వహణకు ఏటా రూ. 12 వేల ఆర్థిక సహాయం అందించాలని కోరారు. ఓలా, ఉబర్, ర్యాపిడోకు ప్రత్యామ్నాయంగా ప్రభుత్వం ఉచిత రవాణా అనువర్తనాన్ని ఏర్పాటు చేయాలని, చట్టవిరుద్ధంగా నడుస్తున్న ర్యాపిడో ద్విచక్ర వాహన సేవలను నిషేధించాలని డిమాండ్ చేశారు. ప్రమాద బీమా పథకాన్ని పునరుద్ధరించి పరిహారాన్ని రూ. 5 లక్షల నుంచి రూ. 10 లక్షలకు పెంచాలని కోరారు. మహాలక్ష్మి పథకం కారణంగా ఆదాయం కోల్పోతున్న ఆటో డ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. టీయూసీఐ



ఉపాధ్యక్షుడు పి. కృష్ణ అధ్యక్షతన జరిగిన సదస్సులో తెలంగాణ ప్రోగ్రెసివ్ ఆటో అండ్ మోటార్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఉయ్యాల ప్రవీణ్, ఏఐటీయూసీ మేడ్చల్ జిల్లా కార్యదర్శి కృష్ణమూర్తి, సీఐటీయూ జిల్లా నాయకుడు లింగస్వామి, బీఎంఎస్ నాయకుడు మహమ్మద్ అబీబ్, టీయూసీఐ ఆటో యూనియన్ కొంపల్లి ప్రాంత ఉపాధ్యక్షుడు బి. వెంకటేష్ ప్రసంగించారు. సదస్సులో సుమారు 180 మంది ఆటో డ్రైవర్లు



# లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

**నర్సింహులపేట, ఆగస్టు 22 (హైదరాబాద్ పల్స్ న్యూస్):** ప్రజా పంపిణీ వ్యవస్థను మరింత పారదర్శకంగా నిర్వహించేందుకు స్మార్ట్ రేషన్ కార్డులు ఉపయోగపడతాయని తహశీల్దార్ రమేష్ బాబు తెలిపారు. శనివారం పెద్దనాగారం స్టేజీ గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ భూక్య సోనియా హరిలాల్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోందన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందేలా చర్యలు చేపడుతోందని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బొబ్బ సోమిరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ రవిబాబు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బొబ్బ సోమిరెడ్డి, కార్యదర్శి మౌనిక, వార్డు సభ్యులు, నాయకులు హరిలాల్, నరేష్ నాయక్, అనిల్, గ్రామ పార్టీ అధ్యక్షుడు శ్రీపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# డంపింగ్ యార్డ్‌కు వ్యతిరేకంగా కోడిచర్ల తండాలో జేఏసీ కమిటీ



**షాద్‌నగర్, ఆగస్టు 22 (హైదరాబాద్ పల్స్ న్యూస్):** డంపింగ్ యార్డ్ ఏర్పాటును వ్యతిరేకిస్తూ కోడిచర్ల తండాలో జేఏసీ గ్రామ కమిటీని ఏర్పాటు చేశారు. జేఏసీ చైర్మన్ రాంబాల్ నాయక్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ ప్రజల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ, భవిష్యత్ తరాల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని డంపింగ్ యార్డ్ ప్రతిపాదనను రద్దు చేసే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని జేఏసీ నాయకులు తెలిపారు. ప్రజల అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోకుండా యార్డ్ ఏర్పాటు చేస్తే ఉద్యమాన్ని మరింత విస్తృతం చేస్తామని హెచ్చరించారు. సలహాదారులుగా మాజీ సర్పంచులు సంతోష్ నాయక్, బిచ్యా నాయక్, అధ్యక్షుడిగా పి. శంకర్ నాయక్, ఉపాధ్యక్షులుగా సూర్య నాయక్, కే. కుమార్, ప్రధాన కార్యదర్శిగా భాస్కర్ నాయక్, కార్యదర్శిగా బాసు నాయక్, కోశాధికారిగా తవురియా, ప్రచార కార్యదర్శిగా దాస్య నాయక్, సమన్వయకర్తగా ప్రవీణ్ నాయక్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో జేఏసీ కన్వీనర్ పినపాక ప్రభాకర్ రావు, డిప్యూటీ సర్పంచ్ రాందాస్ నాయక్, వార్డు సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ కురవి మండల అధ్యక్షుడిగా బాలగాని శ్రీనివాస్ గౌడ్‌కు సన్మానం

**హైదరాబాద్ పల్స్, ఆగస్టు 22, మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి :** మహబూబాబాద్ జిల్లా కురవి మండల కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షుడిగా నియమితులైన బాలగాని శ్రీనివాస్ గౌడ్‌ను తిరుమలపురం కాంగ్రెస్ పార్టీ నాయకులు శనివారం



మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నూతన మండల అధ్యక్షుడికి శుభాకాంక్షలు తెలియజేస్తూ, పార్టీ బలోపేతానికి సమష్టిగా కృషి చేయాలని ఆకాంక్షించారు. కాంగ్రెస్ పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేయడంతో పాటు కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని నాయకులు కోరారు. నూతన బాధ్యతలు చేపట్టిన శ్రీనివాస్ గౌడ్‌కు తమ పూర్తి సహకారం ఉంటుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో తిరుమలపురం కాంగ్రెస్ పార్టీ నాయకులు కళ్లెపు శ్రీనివాస్, కనకటి శ్రావణ్, బొంపల్లి శ్రీనివాస్, కళ్లెపు అశోక్, దేవి సంపత్, పూల ముత్తయ్య, పూల జనార్ధన్, రుద్రగాని రాజు తదితరులు పాల్గొన్నారు.

# ఫోటో జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలి

### అర్హులైన వారికి ఇళ్ల స్థలాలు, ఆరోగ్య కార్డులు ఇవ్వాలి.




**హైదరాబాద్ పల్స్, ఆగస్ట్ 22, సంగారెడ్డి జిల్లా ప్రతినిధి:**
ఫోటో జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించి ప్రభుత్వం అర్హులైన వారిని ఆదుకోవాలని టీయూడబ్ల్యూజే (ఐజేయూ) సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎంఏకే పైసల్ కోరారు.ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా సంగారెడ్డి జిల్లా ఫోటో జర్నలిస్టుల సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో ఫోటోల ప్రదర్శన నిర్వహించారు. అనంతరం జరిగిన సమావేశంలో బండారు యాదగిరి మాట్లాడుతూ ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో ఫోటో జర్నలిస్టులు కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. అర్హులైన ఫోటో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలతో పాటు ఆరోగ్య కార్డులు అందించాలని కోరారు.ఈ సమస్యలపై కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి సానుకూలంగా స్పందించి ప్రభుత్వానికి నివేదిస్తామని తెలిపారు. జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ మాట్లాడుతూ సమస్యలు ఉంటే తనను సంప్రదిస్తే సాధ్యమైనంత మేరకు అండగా ఉంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఫోటో జర్నలిస్టుల సంఘం అధ్యక్షుడు ఆరిఫ్, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, అదనపు కలెక్టర్ పాండు, డీపీఆర్వో విజయలక్ష్మి, జర్నలిస్టులు, మీడియా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# బోయినపల్లిలో పోలీసుల ఆకస్మిక వాహన తనిఖీలు

### ఇన్‌స్పెక్టర్ తిరుపతి రాజు ఆధ్వర్యంలో తనిఖీలు




**ఓల్డ్ బోయినపల్లి, ఆగస్టు 22 (హైదరాబాద్ పల్స్):**
ప్రజల భద్రత, నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా బోయినపల్లి పోలీసులు శనివారం ఆకస్మిక వాహన తనిఖీలు నిర్వహించారు. ఇన్‌స్పెక్టర్ తిరుపతి రాజు ఆధ్వర్యంలో ఓల్డ్ బోయినపల్లి చివరి బస్టాప్ వద్ద తనిఖీలు చేపట్టారు.ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడం, కార్లలో సీటుబెల్ట్ వినియోగం, వాహనాల నంబర్ ప్లేట్లు, డ్రైవింగ్ లైసెన్సులు, వాహన రిజిస్ట్రేషన్ పత్రాలను పోలీసులు పరిశీలించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, మైనర్లకు వాహనాలు ఇవ్వడం, అక్రమ రవాణాను అరికట్టడంపై ప్రత్యేక దృష్టి సారించారు.నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులపై జరిమానాలు విధించడంతో పాటు నంబర్ ప్లేట్ లేని, నకిలీ లేదా మార్పులు చేసిన నంబర్ ప్లేట్లపై చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు రామకృష్ణ, పండు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# తాళ్లూరి బాబు జ్ఞాపకాలు చిరస్మరణీయం

### సేవలు, జ్ఞాపకాలు ఎప్పటికీ నిలిచిపోతాయి: మంద రామారావు



**ఆగస్టు 22, మహబూబాబాద్,(హైదరాబాద్ పల్స్ ప్రతినిధి):**
మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం ఉయ్యాలవాడ గ్రామ శివారులోని తాళ్లూరి బాబు శృతివనంలో దివంగత తాళ్లూరి బాబు ఆరో వర్ధంతి కార్యక్రమాన్ని తాళ్లూరి గంగాధర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.కార్యక్రమానికి చిలుకోడు గ్రామ గౌడ్ సంఘం సర్పంచ్ మంద రామారావు హాజరై తాళ్లూరి బాబు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తాళ్లూరి బాబు కుమారుడు గంగాధర్‌తో కలిసి పుష్పాంజలి ఘటించి ఆయనను స్మరించుకున్నారు.ఈ సందర్భంగా మంద రామారావు మాట్లాడుతూ తాళ్లూరి బాబుతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. ఆయన చేసిన సేవలు, ప్రజలతో ఉన్న అనుబంధం, జ్ఞాపకాలు ఎప్పటికీ చిరస్మరణీయంగా నిలిచిపోతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో అనంతుల ఉపేందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణపై వానల ముప్పు.. నాలుగు రోజులు భారీ వర్షాలు

### హైదరాబాద్ సహా పలు జిల్లాలకు ఎల్లో హెచ్చరిక.. ఉరుములు, మెరుపులతో వర్షాలు

**ఆగస్టు 22, తెలంగాణ బ్యూరో,(హైదరాబాద్ పల్స్ ప్రతినిధి):**
తెలంగాణలో రానున్న నాలుగు రోజులు పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఆగస్టు 23 నుంచి 27 వరకు రాష్ట్రవ్యాప్తంగా అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. పలు జిల్లాలకు ఎల్లో హెచ్చరిక జారీ చేసింది.ఆదివారం కుమురం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని పేర్కొంది.ఆదివారం ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ - మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లోనూ ఉరుములు, మెరుపులతో వర్షాలు పడే అవకాశం ఉందని తెలిపింది.సోమవారం, మంగళవారం కూడా ఉత్తర తెలంగాణతో పాటు హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్--మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది. బుధవారం కూడా పలు జిల్లాల్లో వర్షాలు కొనసాగే అవకాశం ఉందని పేర్కొంది.

**ప్రజలు అప్రమత్తంగా ఉండాలి**
భారీ వర్షాలు కురిసే ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ సూచించింది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాల సమయంలో చెట్లు, విద్యుత్ స్తంభాలు, బహిరంగ ప్రదేశాలకు దూరంగా ఉండాలని హెచ్చరించింది. పిడుగులు పడే అవకాశం ఉన్నందున అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది.




# యాదాద్రి భువనగిరి జిల్లా బీజేపీ కిసాన్ మోర్చా నూతన కమిటీ ప్రకటన

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 22, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :**
భువనగిరి భారతీయ జనతా పార్టీ రాష్ట్ర నాయకత్వం బస్వాపురం లక్ష్మీ నర్సయ్య మరియు యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు ఉట్కూరి అశోక్ గౌడ్ మరియు కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆదేశాల మేరకు యాదాద్రి భువనగిరి జిల్లా కిసాన్ మోర్చా నూతన కార్యవర్గాన్ని అధికారికంగా ప్రకటించడం జరిగింది. జిల్లా వ్యాప్తంగా రైతాంగ సమస్యలపై నిరంతరం పోరాడేందుకు, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రతిభావంతులైన నాయకులకు ఈ కమిటీలో ప్రాతినిధ్యం కల్పించారు.

**నూతన కార్యవర్గ వివరాలు:**
జిల్లా అధ్యక్షుడు: పక్కీర్ రాజేందర్ రెడ్డి (బొమ్మలరామారం)

**ఉపాధ్యక్షులు:**
అనంతుల పాండు రంగా రెడ్డి (మోతకూరు)
వల్లపు అశోక్ (భువనగిరి)
బుర్గు శేఖర్ రెడ్డి (రాజపేట)
బెండల సుభాష్ (యాదగిరిగుట్ట)


ప్రధాన కార్యదర్శులు:
పడమటి మాణిక్యం రెడ్డి (భువనగిరి)
తునికి దాశరథ (ఆలేరు)
బొల్లు నరసింహ యాదవ్(తుర్కపల్లి)

**కార్యదర్శులు:**
గుజ్జల చంద్రశేఖర్ రెడ్డి (యాదగిరిగుట్ట)
మెట్టుపల్లి భాస్కర్ (ఆలేరు)
యేనుగు అలివేలు (పోచంపల్లి)
కందుల తనీషా గౌడ్ (వలిగొండ)
పట్నం దిలీప్ ( భువనగిరి)
కోశాధికారి:అల్వా బాలకృష్ణ రెడ్డి (బీబినగర్)
అనుబంధ విభాగాల కన్వీనర్లు ఢ బాధ్యులు:
సోషల్ మీడియా కన్వీనర్: పొగాకు మల్లేశం (బీబినగర్)
ఐటీ కన్వీనర్: బోరంపేట రవీందర్ రెడ్డి (బొమ్మలరామారం)
కార్యాలయ కార్యదర్శి ( ఆఫీస్ సెక్రటరీ ): పాశం కృష్ణారెడ్డి (మోతకూరు)
టూర్ ఢ మానిటరింగ్ కన్వీనర్: ఎలకొండ రాజశేఖర్ రెడ్డి

**జిల్లా కార్యవర్గ సభ్యులు:**
జక్కుల రామచంద్ర యాదవ్ (గుండాల)
కాదరి రుద్రయ్య (గుండాల)
కొలిపురం నరసింహారెడ్డి (ఆత్మకూర్)
గాదే లింగారెడ్డి (బీబినగర్)
యాస విజయారెడ్డి (ఆత్మకూర్)
పి.నర్సారెడ్డి ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు శ్రీ పక్కీర్ రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ... "జిల్లాలోని రైతుల సమస్యల పరిష్కారానికి కిసాన్ మోర్చా ఎల్లప్పుడూ ముందుంటుందని, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న విప్లవాత్మక రైతు సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయికి తీసుకెళ్తామని" తెలిపారు. తనపై నమ్మకంతో ఈ బాధ్యత అప్పగించిన పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకత్వానికి, శ్రేణులకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

# మాదాపూర్‌లో భవనం కూలిన ఘటనపై బీఆర్ఎస్ నేతల పరిశీలన

### నిర్మాణ అనుమతులపై సమగ్ర విచారణ జరపాలి.. బాధ్యులపై చర్యలు తీసుకోవాలి





**ఆగస్టు 22, శేరిలింగంపల్లి(హైదరాబాద్ పల్స్ ప్రతినిధి):**
మాదాపూర్ అంజయ్యనగర్‌లో ఏడు అంతస్తుల భవనం కూలిన ఘటనపై బీఆర్ఎస్ నాయకులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. సమాచారం అందుకున్న వెంటనే మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, శేరిలింగంపల్లి బీఆర్ఎస్ నాయకులు మారబోయిన రవి యాదవ్, అల్లావుద్దీన్ పటేల్, సంతోష్ తదితరులు అక్కడికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ, కేవలం 50 గజాల స్థలంలో డ్రైనేజీకి ఆనుకుని ఏడు అంతస్తుల నిర్మాణానికి అనుమతులు ఎలా మంజూరయ్యాయో ప్రభుత్వం, సంబంధిత అధికారులు స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం జరుగుతున్న సమయంలో అధికారులు ఎందుకు చర్యలు తీసుకోలేదో వెల్లడించాలని కోరారు.నిర్మాణ అనుమతులు, భవన భద్రతా ప్రమాణాలు, అధికారుల పర్యవేక్షణపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. అక్రమ నిర్మాణాలను అరికట్టి, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

**సమీప భవనాలపై అప్రమత్తత అవసరం**
భవనం కూలిన ప్రాంతానికి సమీపంలోని కొన్ని భవనాలు కూడా ఘటన ప్రభావంతో దెబ్బతిన్నట్లు కనిపిస్తున్న నేపథ్యంలో యజమానులు, నివాసితులు అప్రమత్తంగా ఉండాలని బీఆర్ఎస్ నాయకులు సూచించారు. భవనాల్లో పగుళ్లు, గోడలు లేదా స్తంభాల్లో నష్టం, నేలలో మార్పులు వంటి ప్రమాద సూచనలు కనిపిస్తే వెంటనే అధికారులకు సమాచారం అందించాలని కోరారు. అర్హత కలిగిన ఇంజినీర్లతో భవనాల భద్రతను పరిశీలించుకోవాలని సూచించారు.

**బీఆర్ఎస్ ప్రధాన డిమాండ్లు**
భవనం కూలిన ఘటనపై సమగ్ర విచారణ జరపాలి.
నిర్మాణానికి అనుమతులు ఎలా మంజూరయ్యాయో వెల్లడించాలి.
నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం జరిగితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలి.
ప్రమాదకరంగా ఉన్న అక్రమ నిర్మాణాలను గుర్తించి చర్యలు చేపట్టాలి.
మృతుల కుటుంబాలకు తగిన సహాయం, న్యాయం అందించాలి.ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారే అక్రమ నిర్మాణాలను అరికట్టి, ఘటనకు బాధ్యులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు.

# మత్తు 'చాక్లెట్ల' గుట్టురట్టు..

# మహిళ సహా నలుగురు అరెస్ట్

**22 ఆగస్టు, కుత్బుల్లాపూర్(హైదరాబాద్ పల్స్ ప్రతినిధి):**
యువతను లక్ష్యంగా చేసుకుని సాగుతున్న గంజాయి చాక్లెట్ల అక్రమ రవాణా గుట్టురట్టయింది. సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో కుత్బుల్లాపూర్ ఎస్‌వోటీ, జగద్గిరిగుట్ట పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన తనిఖీల్లో నలుగురు నిందితులను అరెస్ట్ చేశారు.మహాదేవ్‌పురం ప్రాంతంలో గంజాయి సరఫరా జరుగుతోందన్న సమాచారంతో పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. తనిఖీల్లో అక్రమంగా గంజాయి చాక్లెట్లను తరలిస్తున్న నలుగురు సభ్యుల ముఠాను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి సుమారు 22 కిలోల గంజాయి చాక్లెట్లు స్వాధీనం చేసుకున్నారు.అరెస్టయిన వారిలో జగద్గిరిగుట్టకు చెందిన ముగ్గురు పురుషులు, మహారాష్ట్రలోని నాందేడ్‌కు చెందిన ఒక మహిళ ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

**మూలాలపై దర్యాప్తు**
గంజాయి చాక్లెట్లను ఎక్కడి నుంచి తీసుకువచ్చారు, ఎవరికి విక్రయించేందుకు తరలిస్తున్నారు, ఈ వ్యవహారం వెనుక మరెవరైనా ఉన్నారా అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి విచారణ కొనసాగిస్తున్నారు.మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయం, వినియోగానికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. మత్తు పదార్థాల అక్రమ కార్యకలాపాలపై నిఘా కొనసాగుతుందని తెలిపారు.



# సర్‌పై అఖిలపక్ష సమావేశం

## ఈఆర్వోతో ఓటర్ల సమస్యలపై చర్చ

**కుత్బుల్లాపూర్, ఆగస్టు 22 (హైదరాబాద్ పల్స్ ప్రతినిధి):**
ప్రత్యేక ఓటర్ల సవరణ ప్రక్రియలో ప్రజలు, బూత్ స్థాయి ఏజెంట్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంపై కుత్బుల్లాపూర్ ఈఆర్వో కార్యాలయంలో శనివారం అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నారం గోపాల్ రెడ్డి పాల్గొని పలు అంశాలను ఈఆర్వో దృష్టికి తీసుకెళ్లారు.ప్రతి బూత్ స్థాయి ఏజెంట్ పరిధిలో నోటీసులు అందుకున్న ఓటర్ల జాబితాను అందించాలని కోరగా, పరిశీలించి జాబితా అందిస్తామని ఈఆర్వో హామీ ఇచ్చారు. ఒకే కాలనీకి చెందిన ఓటర్లను సాధ్యమైనంత వరకు అదే కాలనీ పరిధిలోని బూత్‌లో కేటాయించాలని కోరారు.నోటీసులు అందుకున్న ఓటర్ల తరఫున బూత్ స్థాయి ఏజెంట్ల ద్వారా సమాధానాలు, సంబంధిత పత్రాలు సమర్పించే అవకాశం కల్పించాలని కోరగా, ఈ అంశాన్ని పరిశీలించి సోమవారం నిర్ణయం తీసుకుంటామని ఈఆర్వో తెలిపారు.డ్రాఫ్ట్ ఓటర్ల జాబితాలో పేర్లు లేని అర్హులైన పౌరులు ఫారం-6 ద్వారా కొత్త ఓటు కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. క్లెయిమ్‌ల స్వీకరణకు అదనపు సిబ్బందిని ఏర్పాటు చేసి, షెడ్యూల్‌ను త్వరలో వెల్లడిస్తామని ఈఆర్వో తెలిపారు. నివాస ప్రాంతానికి అనుగుణంగా బూత్ మార్పు కోసం ఫారం-8 ద్వారా దరఖాస్తు



చేసుకోవచ్చని పేర్కొన్నారు.ప్రత్యేక ఓటర్ల సవరణ ప్రక్రియలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా క్లెయిమ్‌లు, అభ్యంతరాలను స్వీకరించడంతో పాటు ఓటర్ల సమస్యలను పరిష్కరించి ప్రక్రియను పారదర్శకంగా, సజావుగా నిర్వహించాలని అన్నారం గోపాల్ రెడ్డి కోరారు.

# పహల్గామ్ ఉగ్రదాడి కేసులో కీలక పరిణామం

## హాఫీజ్ సయీద్‌కు సమన్లు జారీ చేసేందుకు ఎన్ఐఏ కోర్టు సన్నాహాలు

**న్యూఢిల్లీ, ఆగస్టు 22,(హైదరాబాద్ పల్స్ ప్రతినిధి):**
పహల్గామ్ ఉగ్రదాడి కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా పేర్కొంటున్న లష్కరే తోయిబా వ్యవస్థాపకుడు హాఫీజ్ సయీద్‌కు సమన్లు జారీ చేసేందుకు జమ్మూ కశ్మీర్‌లోని ప్రత్యేక ఎన్ఐఏ కోర్టు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం.ఏప్రిల్ 22న పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడిలో 26 మంది పర్యాటకులు మృతి చెందారు. ఈ ఘటనపై దర్యాప్తు చేపట్టిన జాతీయ దర్యాప్తు సంస్థ హాఫీజ్ సయీద్‌ను కేసులో ప్రధాన నిందితుల జాబితాలో చేర్చింది. ఇప్పటికే అతడిపై ప్రత్యేక ఎన్ఐఏ కోర్టు బెయిల్ లేని అరెస్టు వారెంట్ జారీ చేసినట్లు సమాచారం.కోర్టు విచారణకు హాజరు





కావాలని ఆదేశిస్తూ సమన్లు జారీ చేసి, వాటిని లాహోర్‌లో ఉన్న హాఫీజ్ సయీద్‌కు అందజేసే చర్యలను కేంద్ర ప్రభుత్వం చేపట్టనున్నట్లు తెలుస్తోంది. ఇస్లామాబాద్‌లోని భారత హైకమిషన్ ద్వారా పాకిస్థాన్ విదేశాంగ మంత్రిత్వ శాఖకు సమన్లను పంపే అవకాశం ఉన్నట్లు సమాచారం.

**26/11 కేసులోనూ చర్యలు**
మరోవైపు 26/11 ముంబై ఉగ్రదాడుల కేసులోనూ కీలక పరిణామం చోటుచేసుకుంది. హాఫీజ్ సయీద్, జకీవుర్ రెహమాన్ లఖ్వీ సహా ఆరుగురు నిందితులు పరారీలో ఉన్న నేపథ్యంలో, వారికి కోర్టు ప్రకటన ఉత్తర్వులు అందజేసేందుకు ముంబై పోలీసులు చర్యలు వేగవంతం చేశారు. ఈ నిందితులకు ఇంటర్‌పోల్ ద్వారా నోటీసులు జారీ చేయాలని కేంద్ర హోం మంత్రిత్వ శాఖను కోరినట్లు సమాచారం.

# ఢిల్లీలో విజృంభిస్తున్న స్వైన్ ఫ్లూ.. ఒక్కరోజే 114 కేసులు

**ఆగస్టు 22, న్యూఢిల్లీ.(హైదరాబాద్ పల్స్ ప్రతినిధి):**
దేశ రాజధాని ఢిల్లీలో స్వైన్ ఫ్లూ కేసులు వేగంగా పెరుగుతున్నాయి. ఈ ఏడాది ఇప్పటివరకు 2,392 ఫ్లూ కేసులు నమోదుకాగా, వాటిలో 1,777 కేసులు హెచ్1ఎన్1 వైరస్‌కు సంబంధించినవిగా వైద్యారోగ్యశాఖ అధికారులు వెల్లడించారు. ఒక్కరోజులోనే 114 హెచ్1ఎన్1 కేసులు నమోదవడం ఆందోళన కలిగిస్తోంది.గతేడాది ఇదే కాలంతో పోలిస్తే ఈసారి కేసుల సంఖ్య గణనీయంగా పెరిగినట్లు అధికారులు తెలిపారు. ఢిల్లీ-ఎన్‌సీఆర్ పరిధిలోనూ స్వైన్ ఫ్లూ వ్యాప్తి అధికంగా ఉన్నట్లు పేర్కొన్నారు. పరిస్థితిపై కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ అప్రమత్తమై ప్రజలకు పలు సూచనలు చేసింది.

**ప్రధాన లక్షణాలు:**
స్వైన్ ఫ్లూ సోకినవారిలో జ్వరం, దగ్గు, గొంతునొప్పి, తలనొప్పి, ముక్కు కారడం, ఒళ్లు నొప్పులు,




తీవ్రమైన అలసట వంటి లక్షణాలు కనిపించవచ్చు. కొందరిలో కళ్లలో ఎర్రదనం, నీరు కారడం, బలహీనత కూడా ఉండొచ్చు.

**అప్రమత్తత అవసరం:**
వైరస్ వ్యాప్తిని అరికట్టేందుకు చేతులను తరచుగా శుభ్రం చేసుకోవడం, అవసరమైన సందర్భాల్లో మాస్క్ ధరించడం, అనారోగ్యంతో ఉన్నవారికి దూరంగా ఉండడం వంటి జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు. వృద్ధులు, వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉన్నవారు, దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలు ఉన్నవారు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు.లక్షణాలు తీవ్రంగా ఉంటే ఆలస్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలని అధికారులు సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో పడకలు, వైద్యులు, మందులు, వైద్య పరికరాల కొరత లేదని ఢిల్లీ ఆరోగ్యశాఖ మంత్రి తెలిపారు.

# స.హ చట్టం మండల ప్రధాన కార్యదర్శిగా జాల ప్రశాంత్

## జాల ప్రశాంత్‌కు అక్కన్నపేట మండల ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవ ఎన్నిక

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 22, తెలంగాణ బ్యూరో :** సిద్దిపేట జిల్లా, సమాచార హక్కు చట్టం సాధన కమిటీ సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండల ప్రధాన కార్యదర్శిగా జాల ప్రశాంత్ ని ఈరోజు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా కమిటీ జిల్లా ఇంచార్జి మహేందర్ మాట్లాడుతూ.. సమాచార హక్కు చట్టం ద్వారా ప్రజలకు లభించే హక్కులపై అవగాహన కల్పించడం, ప్రభుత్వ పాలనలో పారదర్శకత, జవాబుదారీతనం పెంపొందించడం, ప్రజా సమస్యల పరిష్కారానికి సమాచార హక్కు చట్టాన్ని సమర్థవంతంగా వినియోగించేలా ప్రజలను చైతన్యపరచడం వంటి కార్యక్రమాల్లో జాల ప్రశాంత్ కీలకంగా పనిచేయాలని ఆకాంక్షించారు.ప్రజలకు ప్రభుత్వ కార్యాలయాల ద్వారా అందాల్సిన సమాచారం, సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సమస్యలకు సంబంధించిన వివరాలను చట్టబద్ధంగా తెలుసుకునే విధానంపై మండలంలోని ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని వారు తెలిపారు.ఈ నియామకానికి సహకరించిన సమాచార హక్కు చట్ట సాధన కమిటీ జాతీయ అధ్యక్షులు డాక్టర్ చంటి ముదిరాజ్ కి, రాష్ట్ర అధ్యక్షులు సుర స్రవంతి మేడం,సిద్దిపేట జిల్లా అధ్యక్షులు మూల జితేందర్ రెడ్డికి, సిద్దిపేట జిల్లా ఇంచార్జీ వేల్పుల మహేందర్ కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.అక్కన్నపేట మండలంలో సమాచార హక్కు చట్టం సాధన కమిటీని మరింత బలోపేతం చేస్తూ, ప్రతి గ్రామంలో ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించేందుకు కృషి చేయాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో చురుకైన పాత్ర పోషిస్తూ, కమిటీ లక్ష్యాలు మరియు ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని కోరారు.సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ, సంస్థ అభివృద్ధికి కృషి చేసి భవిష్యత్తులో మరిన్ని బాధ్యతలు చేపట్టి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షిస్తూ జాల ప్రశాంత్‌ను కమిటీ ప్రతినిధులు, సభ్యులు అభినందించి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.



RIGHT TO INFORMATION ACT - 2005(SHCSC)
(Regd. No. 1094/24)
Office : H.No. 3-359, Sri Dwarakamai Colony, Meerpet, Hyderabad - 500 097. TS.
Email : samacharahakkuchattamsadhana@gmail.com

Dr. Chanti Mudhiraj
National Chairman
Cell : 7801001004

August 22, 2026

Dear JALA PRASHANTH,

I am hereby pleased to appoint you as **General Secretary, Siddipet District, Akkannapet Mandal, Samachara Hakku Chattam Sadhana Committee** with immediate effect. **Samachara Hakku Chattam Sadhana Committee** is confident that you will devote your full time and energy to further strengthen the organization and as well as the Samachara Hakku Chattam Sadhana Committee under the able and dynamic leadership of **Dr. Chanti Mudhiraj Sir & Sura Sravanthi & Mallam Venkatesham & V.Mahender & Mula Jithender Reddy Garu.**

Dr. CHANTI MUDHIRAJ
National Chairman
Right To Information Act - 2005 (SHCSC)
Regd. No. 1094/24, NITI AAYOG TS/2025/0585660
MSJE ID TG/00043492, MSME UDYAM TS-09-134081

(Dr. Chanti Mudhiraj)
National Chairman

**Shri Jala Prashanth,**
General Secretary
Samachara Hakku Chattam Sadhana Committee.

హైదరాబాద్ పల్స్

# తాళ్లూరి బాబు సేవలు చిరస్మరణీయం

## ఆయన ఆశయాలను కొనసాగించడమే నిజమైన నివాళి: మాలోత్ నెహ్రూ నాయక్



**మహబూబాబాద్, ఆగస్టు 22 (హైదరాబాద్ పల్స్ ప్రతినిధి):**
మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం గొల్లగూడెం గ్రామంలో స్వర్గీయ తాళ్లూరి బాబు 6వ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు మాలోత్ నెహ్రూ నాయక్ తాళ్లూరి బాబు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా నెహ్రూ నాయక్ మాట్లాడుతూ ప్రజల పట్ల ప్రేమాభిమానాలతో మెలుగుతూ తాళ్లూరి బాబు సమాజ సేవకు తన వంతు కృషి చేశారని గుర్తుచేశారు. ప్రజా సేవకు అంకితమైన ఆయన జీవితం నేటి తరానికి ఆదర్శప్రాయమన్నారు.ప్రజల కోసం కృషి చేసిన వారి సేవలను స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, వారి ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే వారికి అందించే నిజమైన నివాళి అని పేర్కొన్నారు.కార్యక్రమంలో తాళ్లూరి బాబు కుమారుడు తాళ్లూరి గంగాధర్, కుటుంబ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, యువకులు, అభిమానులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# మోహన్ బాబు నాయక్ ను సన్మానించిన ఎరుకల వెంకటేష్ గౌడ్



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 22, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :**
యాదాద్రి భువనగిరి జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి డిస్ట్రిక్ట్ విజిలెన్స్ మరియు మానిటరింగ్ కమిటీ సభ్యునిగా నియమితులైన యాదాద్రి భువనగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి మరియు రుస్తాపూర్ మాజీ ఎంపీటీసీ సభ్యుడు ధనావత్ మోహన్ బాబు నాయక్ ని తుర్కపల్లి మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మరియు కామ్రేడ్ ఎరుకల కుమార స్వామి గౌడ్ ఫౌండేషన్ చైర్మెన్ ఎరుకల వెంకటేష్ గౌడ్ శాలువాతో ఘనంగా సన్మానించి నట్లు తెలిపారు. యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టిన సందర్భంగా మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించడం జరిగిందని పేర్కొన్నారు బడుగు బలహీన వర్గాలకు అతని సేవలు కొనసాగించి వారి హక్కుల సాధన కోసం పునరశీకితం కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సింగిల్ విండో చైర్మెన్ ధనావత్ శంకర్ నాయక్, తుర్కపల్లి మండల సర్పంచ్ ల ఫోరం మండల అధ్యక్షుడు, చాడ భాస్కర్ రెడ్డి, వివిద గ్రామాల సర్పంచ్లు జేరిపోతుల కరుణాకర్, గూగులోత్ దూప్ సింగ్, మాజీ సర్పంచ్, సోక్కుల మోహన్ రెడ్డి, సింగల్ విండో డైరెక్టర్ సతీష్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, దొంకేన వెంకటేష్, సురేష్ నాయక్, గుండె బోయిన బాల మల్లు, శ్రీ శైలం,శివా నాయక్, రాములు నాయక్, సీను నాయక్, సుగ్రీవ చారి, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వల్లేపు రమేష్, మన్నే మహేష్, ఉప సర్పంచ్ ఏనుగు సిద్ధులు, గ్రామ శాఖ అధ్యక్షుడు జేరిపోతుల నరేందర్, వార్డు సభ్యుడు నల్ల రాజు, గొప్ప కొండల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

# గొర్రెల మేకల పెంపక దారుల రాష్ట్ర 4వ మహాసభలు

## మహాసభలలో పాల్గొన్న మల్లాపురం గొర్రెల మేకల పెంపక దారుల సంఘం నాయకులు



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 22, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :**
యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలం మల్కాపురం గొర్రెల మేకల పెంపక దారుల సంఘం నాయకులు, గొర్రెల మేకల పెంపక దారుల సంఘం 30 సంవత్సరాల సందర్భంగా రాష్ట్ర 4వ మహాసభలు కార్యక్రమంలో పాల్గొన్నారు. మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా చెంగచెర్లలో నిర్వహించారు ఈ 30 సంవత్సరాలలో గొర్రెల పెంపకదారులు ఎదుర్కొన్న సమస్యలపై ఉద్యమాలు పోరాటాలు నిర్వహించి అనేక విజయాలు సాధించారు తుమ్మ చెట్లపై గొర్రెల కాపరులకు హక్కు కల్పించే 1016 జీవో నేత భూములు కేటాయించాలని 559 జీవో సాధించాం జీవాలకు నత్తల మందులు వ్యాక్సిన్లు సాధించాము ఇంకా మరిన్ని గొర్రెల కాపరులకు గుర్తింపు కార్డు 50 సంవత్సరాలు నిండిన గొర్రెల కాపరులకు పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేయడానికి ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లడానికి ఈ సభలు నిర్వహిస్తున్నాము అని తెలిపారు. ఈ కార్యక్రమంలో యాదగిరిగుట్ట మండలం మల్లాపురం గొర్రెల మేకల పెంపకదారులు కర్రె మల్లేశం , కర్రె చిన్నోళ్ల స్వామి, మోటే అంజయ్య, గౌడ యాదయ్య, కర్రె బీరప్ప, కర్రె చంద్రశేఖర్ పాల్గొన్నారు